ఎన్నికలకే నగదు మళ్లింపు

అడ్డదారిలో 'వాల్మీకి' సొమ్ము: ఈడీ


మాజీ మంత్రి నాగేంద్ర

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన నగదును దారి మళ్లించి అందులో కొంత మొత్తాన్ని బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చు చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ అభియోగపత్రంలో పేర్కొన్నారు. రూ.187 కోట్ల నిధుల నుంచి రూ.89.62 కోట్లను ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఖాతాలకు అక్రమ మార్గంలో తరలించారని ఈడీ అధికారులు ఆరోపించారు. అక్రమాల్లో మాజీ మంత్రి బి.నాగేంద్రను ప్రధాన నిందితుడని అందులో నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఫస్ట్ క్రెడిట్ కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, బ్యాంకు అధ్యక్షుడు ఇటకారి సత్యనారాయణ, కార్పొరేషన్ ఎండీ జేజీ పద్మనాభ, వారి అనుచరులు నాగేశ్వరరావు, నెక్కంటి నాగరాజ్, విజయకుమార్ గౌడ తదితరులను నిందితులుగా చేర్చారు. గంగా కల్యాణ పథకానికి కేటాయించిన రూ.43.33 కోట్లను అక్రమ ఖాతాలకు మళ్లించగా, అందులో బళ్లారి ఎన్నికల కోసం రూ.20.19 కోట్లు దారి మళ్లించి ఖర్చు చేశారని దర్యాప్తులో గుర్తించారు.

నాగేంద్రకు ఉపశమనం

బెంగళూరు (సదాశివనగర): మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అక్రమాలకు సంబంధించి కారాగారం చేరిన మాజీ మంత్రి బి.నాగేంద్రకు 82వ ఫాస్ట్ ట్రాక్ కోర్టు సోమవారం బెయిలు మంజూరు చేసింది. రూ.2 లక్షల బాండ్, ఇద్దరు వ్యక్తిగత పూచీకత్తు, విచారణకు క్రమం తప్పకుండా హాజరు కావడం తదితరాలను షరతులుగా విధించారు. కార్పొరేషన్‌కు చెందిన నగదును అక్రమ మార్గాల్లో వివిధ ఖాతాలకు బదిలీ చేయడం వెనుక నాగేంద్ర పాత్ర ఉందని ఈడీ అధికారులు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు దళం నాగేంద్రకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈడీ అధికారులు నాగేంద్రదే కీలక పాత్ర అని ఆరోపించి, మూడు నెలల కిందట అరెస్టు చేసి పరప్పన అగ్రహార కారాగారానికి పంపించిన విషయం తెలిసిందే.

వనరుల సమీకరణమే

- పన్నుల వాటా కోసం పోరు
- ప్రజారుణ సాధనకు ప్రణాళిక

ఈనాడు, బెంగళూరు : ఆర్థిక త్రైమాసికాల్లో ఆదాయ వనరుల సమీకరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు మొదలు పెట్టింది. ముఖ్యమంత్రి మొదలు కీలక శాఖల మంత్రులంతా రాజకీయపరమైన ఒత్తిళ్లలో మునిగి తేలుతుంటే.. అధికార వర్గం బడ్జెట్‌లో ప్రకటించిన కార్యక్రమాలను అమలు చేయటం, అందు కోసం ఆర్థిక వనరుల సేకరణ కోసం కసరత్తు ప్రారంభించింది. స్వయంగా ముఖ్యమంత్రి ఆర్థికశాఖను నిర్వర్తిస్తుండగా, ఆయన ఆదేశాలతో మూడో త్రైమాసికంలో ఆదాయ వనరులను బలపరచుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సెప్టెంబరు మాసంలో రెండో త్రైమాసికం ముగియగా.. అక్టోబరులో మూడో అంకం మొదలైంది. ఈనెల నుంచే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకోక తప్పదు.

కేంద్రంపై అసంతృప్తి



ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2024-25 రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదించి ఆరు నెలలు ముగిసింది. లోక్‌సభ ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రకారం ఈ ఏడాది పూర్తి స్థాయిలో ఐదు గ్యారంటీలను అమలు చేయాలి. నిరుటి ఎనిమిది నెలల కోసం రూ.35 వేల కోట్లను ఈ గ్యారంటీలకు కేటాయించిన సర్కారు ఈ ఏడాది పూర్తి స్థాయి ఆర్థిక సంవత్సరానికి రూ.54 వేల కోట్లను కేటాయించాలి. బడ్జెట్‌లో అంచనా వేసినట్లు రూ.54 వేల కోట్లతో ఇప్పటికే ఆరు నెలలకు గాను రూ.28 వేల కోట్లను వ్యయం చేశారు. ఇవి కాకుండా అభివృద్ధి పనుల కోసం మరో రూ.50 వేల కోట్లను ప్రత్యేకించక తప్పదు. అసలే లోటు బడ్జెట్‌ను ప్రతిపాదించిన ముఖ్యమంత్రి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 లక్షల కోట్లు అప్పు చేయాలని నిర్ణయించారు. ఈ మొత్తం కోసం ఇప్పటి వరకు బహిరంగ మార్కెట్‌పై దృష్టి సారించకుండా కేంద్ర నిధులపైనే ఆధారపడింది. కేంద్రం వసూలుచేసే పన్నుల్లో వాటా కింద కనీసం రూ.14 వేల కోట్లయినా వస్తుందని ఆశించినా సగం కూడా దక్కలేదు. కర్ణాటకపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ముఖ్యమంత్రి ఇటీవలే కేంద్రంపై నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే. గడచిన ఐదేళ్లలో రాష్ట్రం కేంద్రం నుంచి రూ.60 వేల కోట్ల వాటాను కోల్పోయినట్లు ఆరోపించిన సర్కారు ఇతర మార్గాల ద్వారా వనరులను సమకూర్చుకోవాలని చూస్తోంది.

రుణాలపై దృష్టి


తొలి సగం ఆర్థిక సంవత్సరంలో అంతగా రుణాలపై ఆధారపడని సర్కారు రాష్ట్ర పన్నుల ద్వారా ఖర్చులు వెళ్లదీసింది. రిజిస్ట్రేషన్, ముద్రణ, మోటారు వాహనం, అబ్కారీ తదితర శాఖల నుంచి అంచనాకు మించిన పన్నులు వసూలు చేసింది. వీటితో తొలి ఆరు నెలలు నెట్టుకొచ్చింది. మిగిలిన ఆరు నెలలకు బడ్జెట్‌లో అంచనా వేసినట్లు కేంద్రం, ఆర్‌బీఐ బహిరంగ మార్కెట్ నుంచి రుణాలు పొందాలని చూస్తోంది. ఈ క్రమంలో కేంద్రం నుంచి రూ.6,885 కోట్లు, బహిరంగ మార్కెట్ నుంచి రూ.97 వేల కోట్లను రుణంగా పొందాలని సెప్టెంబరు నుంచే రంగం సిద్ధం చేసింది. సెప్టెంబరు చివరి నాటికి రూ.3 వేల కోట్లను ప్రజా రుణాల ద్వారా సేకరించిన సర్కారు రానున్న రోజుల్లో ప్రతి వారం రూ.4 వేల కోట్ల వరకు బహిరంగ మార్కెట్ నుంచి రుణాలు పొందనుంది. ఇలా వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.96 వేల కోట్లను తీసుకుని గ్యారంటీలతో పాటు సంక్షేమ, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని చూస్తోంది. ఈలోగా ఆర్థిక సంఘం, నాలుగో త్రైమాసికానికి కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా కూడా సర్కారుకు ఊరట కలిగిస్తాయని భావిస్తున్నారు.


పథకాల భారం : సండూరులో సోమవారం నిర్వహించిన సభలో ఓ లబ్ధిదారుడికి పథకాల పత్రాలు అందిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

మరింత ఒత్తిడి

ఇప్పటికే కేంద్రంపై రాష్ట్రానికి దక్కాల్సిన నిధుల కోసం పోరుబాటను సిద్ధం చేసుకున్న సర్కారు ఈ నెలలోనే ఆర్థిక సమ్మేళనం నిర్వహించేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారులు బసవరాజ రాయరెడ్డి నేతృత్వంలో నిర్వహించే ఈ సమ్మేళనం రాష్ట్రాలకు కేంద్రం విడుదల చేసే పన్నుల వాటాలో హేతుబద్ధత, 15వ ఆర్థిక సంఘంలో దక్కని నిధులను కనీసం 16వ ఆర్థిక సంఘంలో చేర్చటం, భాజపాయేతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులను ఈ సమ్మేళనానికి ఆహ్వానించి ఓ తీర్మానాన్ని రూపొందిస్తామని బసవరాజ రాయరెడ్డి తెలిపారు. ఇదే సందర్భంగా కేంద్రం నుంచి రాష్ట్రాలకే జరిగే అన్యాయాన్ని నిలదీసేలా పలు కార్యక్రమాలు రూపొందిస్తారు.

ఉపాధి కరవై.. బతుకు బరువై
కడతేరిన కుటుంబం



అన్నను చూడాలని ఉదయ్ కలబురగి నుంచి ఉదయమే బెంగళూరుకు చేరుకున్నాడు. వస్తున్నానని చెబుదామంటే ఎంతకీ ఫోన్ పనిచేయడం లేదు. యడియూరప్ప లేఅవుట్‌లోని వారింటికి తెల్లారే వెళ్లి తలుపుతడితే ఉలుకూ పలుకూలేదు. చుట్టుపక్కల వారి సాయంతో తలుపు తీసి చూస్తే.. దారుణ దృశ్యం కళ్లముందు కనిపించింది.

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బెంగళూరు నగర శివారు యలహంక పరిధి యడియూరప్ప లేఅవుట్‌లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వారంతా ఉత్తర కర్ణాటకలోని కలబురగి నగరానికి చెందిన వారని గుర్తించారు. అవినాశ్ (33), ఆయన భార్య మమత (30), వారి పిల్లలు అధీర్ (5), అనయా (3)లను మృతులుగా గుర్తించారు. అవినాశ్ ఆరేళ్లుగా యడియూరప్ప లేఅవుట్‌లో ఉంటూ కారు డ్రైవరుగా, అనిత ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉపాధి కల్పించుకున్నారు. మృతుని సోదరుడు ఉదయ్ తన అన్నను పలకరించేందుకు సోమవారం ఉదయం ఇంటికి వచ్చినప్పుడు వీరి బలవన్మరణం వెలుగులోకి వచ్చింది. పిల్లలను గొంతు నులిమి చంపి, వీరిద్దరూ ఉరి వేసుకుని ఉంటారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ సీకే బాబా తెలిపారు. రాజానుకుంటె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక సమస్యలు, ఆశించిన స్థాయిలో ఉద్యోగం దొరక్కపోవడంతో ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

మత్తులో.. గొంతుకోసి కడతేర్చిన మిత్రుడు



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన గొడవలో యోగేంద్ర సింగ్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. హత్య చేసిన ఉమేశ్‌ను బ్యాటరాయనపుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నరసాపుర పారిశ్రామికవాడలోని ఓ సంస్థ మినీ బస్సులో డ్రైవరుగా సింగ్ పని చేస్తూ అక్కడే ఒక గది తీసుకుని ఉంటున్నాడు. వరుస సెలవులు ఉండడంతో కస్తూర్‌బా నగరలోని తన కుటుంబ సభ్యుల వద్దకు వచ్చాడు. అక్కడికి సమీపంలో ఉంటున్న తన పాత స్నేహితుడు ఉమేశ్‌ను ఆదివారం రాత్రి కలిశాడు. ఇద్దరూ కలిసి హొసగుడ్డదహళ్లిలోని ఒక మద్యం దుకాణానికి వెళ్లారు. మద్యం తాగిన అనంతరం చిన్నవిషయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. మద్యం సీసా పగలగొట్టి, దానితో గొంతులో పొడవడంతో తీవ్రంగా గాయపడి యోగేంద్ర సింగ్ అక్కడికక్కడే మరణించాడు.

విలాసాలకు అడ్డనే బిడ్డలు భూస్థాపితం

రామనగర, న్యూస్‌టుడే : తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నారని కుమార్తె కపిల (3), కుమారుడు కపిలన్ (11 నెలలు)ను హత్య చేసిన స్వీటీ (24), అందుకు సహకరించిన ఆమె ప్రియుడు గ్రిగరీ ఫ్రాన్సిస్ (27)లను ఐజూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరులోని ఏకే కాలనీ నుంచి బిడ్డలను తీసుకుని ప్రియునితో కలిసి పరారై వచ్చి రామనగరలోని మంజునాథ నగరలో స్వీటీ ఉంటోంది. అక్టోబరు ఒకటిన కుమార్తెను, 7వ తేదీన కుమారుడ్ని హత్య చేసి, శ్మశానవాటికలో పూడ్చి పెట్టింది. వారం తేడాలో ఇద్దరు బిడ్డలు మరణించారని ఆమె చెప్పడంతో స్వీటీ, గ్రిగరీ ఫ్రాన్సిస్‌ల ఫొటోలను శ్మశానవాటిక కాపలాదారు చరవాణిలో తీసుకుని పోలీసులకు సమాచారం అందించాడు. ఆ చర్యతోనే ఈ హత్యలు వెలుగులోకి వచ్చాయి. మృతదేహాలకు మహజరు నిర్వహించారు. గాలింపు చేపట్టి నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు.

తరగతి గదిలోనే ఆమె.. ఆత్మహత్యాయత్నం

బెంగళూరు (మల్లేశ్వరం): బెంగళూరు తిలక్‌నగరలోని ఒక ప్రైవేటు మాధ్యమికవిద్య (పీయూ) కళాశాలలో ఆంగ్లాన్ని బోధిస్తున్న ఓ లెక్చరర్ (44) తరగతి గదిలో నిద్రమాత్రలు తీసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. ప్రిన్సిపల్ తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆమె ఆరోపిస్తూ తరగతి గదికి వచ్చి నిద్రమాత్రలను వేసుకున్నారు. విద్యార్థులు తక్షణమే అప్రమత్తమై ఆమెను చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమెకు ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు. తిలక్‌నగర ఠాణా పోలీసులు దర్యాప్తు కొనసాగించారని ఆగ్నేయ విభాగం డీసీపీ సారా ఫాతిమా తెలిపారు.

హాస్టల్‌లో బలవన్మరణం

చామరాజనగర, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రం చామరాజనగరలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహం (బీసీఎం హాస్టల్)లో వంట సహాయకునిగా పని చేస్తున్న ప్రమోద్ (28) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుండ్లుపేట తాలూకా బేగూరులోని హాస్టల్‌లో గత కొద్ది రోజులుగా అతను సహాయకునిగా పని చేస్తున్నాడు. విద్యార్థులంతా సెలవులకు ఇళ్లకు వెళ్లిన క్రమంలోనే ఆయన ఆదివారం రాత్రి తన గదిలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. బేగూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తీవ్రవాదుల చెప్పుచేతల్లో సర్కారు

నిప్పులు చెరిగిన అశోక్


బెంగళూరులో ధర్నాలో భాజపా నాయకులు, కార్యకర్తలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : అధికార పార్టీ- తీవ్రవాదులు, ఒక సముదాయంలోని మత పెద్దల చెప్పు చేతల్లో పని చేస్తోందని విపక్ష నేత ఆర్ అశోక్ విమర్శలు గుప్పించారు. పాత హుబ్బళ్లి పోలీసు ఠాణాపై దాడి చేసి, వాహనాలకు నిప్పు పెట్టిన ముస్లిం సంఘాలు, ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు, నేతలపై కేసులు వెనక్కు తీసుకోవాలని మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ఇతర నాయకులతో కలిసి సోమవారం ఇక్కడ నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భాజపా ఎమ్మెల్యే మునిరత్నపై అత్యాచారం ఆరోపణలు వచ్చిన వెంటనే కారాగారానికి పంపించిన ప్రభుత్వం- కాంగ్రెస్ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణిపై కేసు నమోదైనా ఇప్పటి వరకు విచారణ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిపై ముడా, వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణాల ఆరోపణలు ఉన్నా, విచారణకు హాజరు కాకుండా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. ఫ్రీడంపార్కులో ధర్నా అనంతరం రాజ్‌భవన్‌కు వెళ్లి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసి, వినతి పత్రాన్ని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు అందించారు. పార్టీ నాయకులు అశ్వత్థ నారాయణ, చలువాది నారాయణ స్వామి, సీకే రామమూర్తి, ఎస్ హరీశ్, సప్తగిరి గౌడ, తదితరులు గవర్నర్‌తో వివిధ అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.

'రైతులపైనా కేసులు రద్దు'

బెంగళూరు (యశ్వంతపుర): 'హుబ్బళ్లి కేసు'లు వెనక్కి తీసుకున్నట్లు రైతులు, విద్యార్థులు, సామాన్యులపై ఉద్యమాల సందర్భంగా వివిధ ఠాణాల్లో నమోదైన అభియోగాలనూ వెనక్కి తీసుకుంటామని హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ హామీనిచ్చారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం న్యాయస్థానం అనుమతితో కేసులు వెనక్కి తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఇలాంటి 56 అంశాల విరమణకు ప్రతిపాదనలు రాగా.. 43 కేసులు రద్దు చేస్తున్నట్లు వివరించారు.


గవర్నర్ గహ్లోత్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

ఇక.. నే బౌద్ధుడిని


మహదేవప్ప

మైసూరు, న్యూస్‌టుడే : హిందూ ధర్మాన్ని వీడి బౌద్ధ ధర్మాన్ని స్వీకరిస్తున్నానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హెచ్‌సీ మహదేవప్ప ప్రకటించారు. మనిషికి స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరభావాన్ని బోధించే బౌద్ధ ధర్మాన్ని తాను మొదటి నుంచి ఇష్టపడుతున్నట్లు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న మహదేవప్ప మైసూరు జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రధాన మద్దతుదారుల్లో ఆయన ఎంతో కీలకం.

నిరుద్యోగుల గోడు వినపడదా?


నినాదాలు రాసిన అట్టముక్కలు ప్రదర్శిస్తున్న

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఖాళీగా ఉన్న 545 ఎస్సై పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల ఫలితాలను నాలుగు నెలలైనా ఇప్పటి వరకు ప్రకటించలేదంటూ పరీక్ష రాసిన అభ్యర్థులు సోమవారం బెంగళూరులో ధర్నాకు దిగారు. ముఖ్యమంత్రి, హోం మంత్రి తదితరులు స్పందించి మా ఫలితాలను ఎప్పుడు ప్రకటిస్తారో చెప్పాలంటూ నినాదాలు రాసిన అట్టముక్కలను ఫ్రీడంపార్కులో ప్రదర్శించారు. మా సమస్య కనిపించడం లేదా? మా గోడు వినిపించడం లేదా? అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

రాజధానిపై అల్పపీడన ప్రభావం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం నగరంపైనా కనిపించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా.. మరికొన్ని చోట్ల మోస్తరు వర్షపాతం నమోదైంది. చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాల్లోనూ కొన్ని చోట్ల భారీ వర్షం నమోదైంది. గురువారం వరకు బెంగళూరు, బెంగళూరు గ్రామీణంతో పాటు పది జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.


గొడుగు వేసుకుని బైకుపై వెళుతున్న దంపతులు

దర్శన్‌కు దక్కని బెయిలు


దర్శన్

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో బెయిలు కోసం నటి పవిత్రా గౌడ, నటుడు దర్శన్ వేసుకున్న బెయిలు అర్జీని 57వ సీసీహెచ్ న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇదే కేసులో ఏ8 రవిశంకర్, ఏ13 దీపక్‌లకు న్యాయమూర్తి జైశంకర్ బెయిలు మంజూరు చేశారు. బెయిలు కోసం ప్రదోష్, వినయ్, జగదీశ్‌లు వేసుకున్న అర్జీపై విచారణను బుధవారానికి వాయిదా వేశారు. మొత్తం 17 మంది నిందితుల్లో ఐదుగురికి ఇప్పటి వరకు బెయిలు లభించింది. దర్శన్ తరఫున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్, పవిత్రా గౌడ పక్షాన సెబాస్టియన్ వాదనలు వినిపించారు. ప్రత్యేక దర్యాప్తు దళం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రసన్న కుమార్ వాదనలు వినిపించారు. అభియోగపత్రంలో పోలీసులు కొన్ని తప్పులు చేశారని నాగేశ్ చేసిన వాదనను ప్రసన్నకుమార్ ఖండించారు. హత్య చేసినట్లు కీలక సాక్ష్యాలు ఉన్నాయని, దర్శన్, పవిత్రా గౌడకు బెయిలు ఇవ్వకూడదంటూ అభ్యంతరం తెలిపారు. తీర్పును ప్రశ్నిస్తూ ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకుంటామని సీవీ నాగేశ్ తెలిపారు.



పద్మవ్యూహమే: ఉద్యాననగరిలో వాహన రద్దీ పద్మవ్యూహమే. వరుస సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లిన నగరవాసి.. సోమవారం ఉదయమే నగరంలోని తన నివాసానికి, కార్యాలయాలకు చేరుకునేందుకు సాహసం చేశాడు. నగరం నుంచి బయటకు తేలికగా వెళ్లినా.. తిరిగివచ్చే సమయంలో పడిన అగచాట్లు వర్ణనాతీతం. నాలుగు వైపులా ఉన్న టోల్‌గేట్ల వద్ద వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోయాయి. విమానాశ్రయ దారిలో పదిహేను కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు నాలుగు గంటల సమయం తీసుకుంది. ఒకేసారి ఎక్కువ వాహనాలు రావడంతో ట్రాఫిక్ పోలీసులు కూడా విధులు నిర్వహించేందుకు ఇబ్బంది పడ్డారు. ఇళ్లకు, కార్యాలయానికి చేరుకున్న వారు బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. **-న్యూస్‌టుడే, శివాజీనగర**

సూక్ష్మ రుణ సంస్థల సతాయింపులు

బెళగావి: ఉత్తర కర్ణాటకతో పాటు బెళగావి జిల్లాలో సూక్ష్మ రుణ సంస్థల పీడ తీవ్రమైందని వివిధ రైతు సంఘాల ప్రతినిధులు సోమవారం బెళగావిలోని కిత్తూరు రాణి చెన్నమ్మ కూడలిలో ఆందోళనకు దిగాయి. బడుగు రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని, విపరీతమైన వడ్డీలు గుంజుతూ హింసిస్తున్నట్లు నిరసన తెలిపారు. కూడలిలో బైఠాయించి ఆక్రోశం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలంటూ ఆకుపచ్చ కండువాలు ఎగురవేస్తూ నినదించారు.


అటవీ శిబిరానికి వెళ్లేందుకు లారీలు ఎక్కిన ఏనుగులు

సేవలందించాం.. ఇక సెలవ్!

మైసూరు, న్యూస్‌టుడే : విశ్వ విఖ్యాత దసరా ఉత్సవాలకు తెరపడడంతో వివిధ అటవీ శిబిరాల నుంచి వచ్చి.. వేడుకల్లో సేవలందించిన ఏనుగులు తిరిగి తమ శిబిరాలకు సోమవారం బయలుదేరాయి. ప్యాలెస్ ఆవరణలో ఒకటిన్నర నెలల పాటు అభ్యాసంలో పాల్గొని, శనివారం జంబూ సవారీలో పాల్గొన్న ఏనుగులకు అటవీశాఖ అధికారులు, మావటీలు, మైసూరు దసరా ఉత్సవ సమితి ప్రతినిధులు పూజలు చేశారు. లారీల్లో ఎక్కించి, వాటిని ఆయా శిబిరాలకు తరలించారు. కాగా, రాత్రుళ్లు విద్యుత్తు దీపాలంకరణను ఈ నెల 22 వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. సోమవారం కూడా మైసూరులో పర్యాటకుల సంఖ్య, రద్దీ ఎక్కువగానే కనిపించింది.


విద్యుత్తు దీపాల వెలుగులో మెరిసిపోతున్న రాచనగరి

గ్యారంటీలు రాష్ట్ర ప్రగతికి దిక్సూచి

సండూరు తాలూకాకు రూ.1216 కోట్లు ➡ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన


సండూరు అభివృద్ధికి కారణం తుకారామ్ అని చూపుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య


ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి వచ్చిన మహిళలు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీలతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోంది. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో సండూరు పట్టణంలోని విశ్వాస్ యు.లాడ్ మైదానంలో ఏర్పాటు చేసిన తాలూకా సాధన సమావేశం, అభివృద్ధి పనులకు భూమిపూజ, అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. సండూరు ప్రాంతంలో రూ.280 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. 2004 నుంచి 2024 వరకు రూ.1,216 కోట్లు నిధులు విడుదల చేశాం. నిడుగుర్తిలో 58 గ్రామాలకు రూ.160 కోట్లతో బహుళ గ్రామాల తాగునీటి పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. 2013లో రాష్ట్రంలో సుమారు 15 లక్షల పక్కా గృహాలు నిర్మించాలని లక్ష్యంకాగా సండూరు తాలూకాలోని 12 వేల పక్కా గృహాలు నిర్మించారని గుర్తుచేశారు. సండూరు తాలూకా సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.1216 కోట్లు కేటాయించింది. ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం శ్రమిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమలు చేసింది తమ ప్రభుత్వమేనని, వారి అభివృద్ధికి రూ.33,182 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

పన్నుల వాటాలో రాష్ట్రానికి అన్యాయం

పన్నుల వాటా నిధుల కేటాయింపులో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. పన్నుల వసూళ్లలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. మనకు రావాల్సిన వాటా దక్కడం లేదని విచారం వ్యక్తం చేశారు. సండూరు తాలూకా అభివృద్ధికి మంత్రి సంతోష్ ఎస్.లాడ్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ ప్రధాన కారణమన్నారు. తాలూకాను అభివృద్ధి చేసిన ఘనత వారికే దక్కుతుంది. అభివృద్ధి అంటే తుకారామ్.. తుకారామ్ అంటే అభివృద్ధి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మాట్లాడుతూ కల్యాణ కర్ణాటకలో సండూరు ఓ ప్రాంతం, ఈ ప్రాంతంలో ఉద్యోగాలు, వైద్య, ఇంజినీరింగ్ సీట్లు విద్యార్థులకు లభిస్తున్నాయని తెలిపారు. నా విధాన సభ నియోజకవర్గం కనకపుర కంటే సండూరు తాలూకా అభివృద్ధికి రూ.1216 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ మాట్లాడుతూ తాలూకా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చిందన్నారు. లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ మాట్లాడుతూ సండూరు తాలూకా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. సండూరు పట్టణానికి అమృత 2.0 పథకం కింద నారిహళ్ల నుంచి శుద్ధతాగునీటి పథకానికి రూ.54.45 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రూ.2.50 కోట్లతో తాలూకా కేంద్రంలో కనక భవనం నిర్మిస్తున్నట్లు వివరించారు. వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ నుంచి వీరశైవ లింగాయతి, విశ్వకర్మ, కురుబ, మేదర, యాదవ, మడివాల, తదితర 13 సంఘాలకు రూ.7.50 కోట్లతో సముదాయ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. చోరనూరు గ్రామంలో అన్ని వసతులతో కలిగిన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రూ.2.58 కోట్లు కేటాయించినట్లు వివరించారు. సండూరులో ఏపీఎంసీ మార్కెట్, తోరణగల్లులో రూ.2 కోట్లతో పదవీ పూర్వ కళాశాల నిర్మిస్తున్నట్లు ఎంపీ తుకారామ్ తెలిపారు. సండూరు పట్టణంలో 200 పడకల అధునాతన ఆసుపత్రికి రూ.180 కోట్లు, సండూరు పట్టణం, డి.అంతాపుర గ్రామల్లో రూ.56 కోట్లతో విద్యుత్తు ఉప కేంద్రాలు నిర్మాణం, సండూరు పట్టణంలో రూ.30కోట్లతో బస్సు ప్రాంగణం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ జిల్లాకు కేటాయించిన నిధులు, వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి సంతోష్ జార్కిహోళి వివరించారు. ఎమ్మెల్యేలు గణేష్, నారా భరత్‌రెడ్డి, బి.ఎం.నాగరాజు, డా.శ్రీనివాస్, లతా మల్లికార్జున, కె.ఎం.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్, మండలి అధ్యక్షుడు ముందరగి నాగరాజ, జిల్లా బాధ్య కార్యదర్శి డా.త్రిలోకచంద్ర, డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఐజీపీ లోకేష్‌కుమార్, ఎస్పీ శోభారాణి, జెడ్పీ సీఈవో రాహుల్, ఏడీసీ మహమ్మద్ ఝుబేర్, ఏసీ ప్రమోద్‌కుమార్ తదితర జిల్లా, తాలూకా స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల అజెండా అమలుకు కృషి

ఎన్నిల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తమ ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే ఐదు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేసిందని సీఎం తెలిపారు. గ్యారంటీలతో రాష్ట్ర అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలో శక్తి పథకం కింద సుమారు 300 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారు. గృహలక్ష్మి పథకం కింద 1.21 కోట్ల మంది మహిళలకు నెలకు రూ.2వేలు నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద రాష్ట్రంలో 1.60 కోట్ల గృహాలకు 200 యూనిట్లు విద్యుత్తు అందజేస్తున్నాం. నిరుద్యోగులకు యువనిధి కింద డిగ్రీలు, స్నాతకోత్తర అభ్యర్థులకు నెలకు రూ.3వేలు, డిప్లొమా అభ్యర్థులకు నెలకు రూ.2వేలు అందజేస్తున్నట్లు వివరించారు.


బహిరంగ సమావేశానికి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు


ప్రసంగిస్తున్న కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్


బహిరంగ సమావేశానికి తరలివచ్చిన జనం


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్


లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్

నారిహళ్ల జలాశయానికి సిద్ధు వాయనం సమర్పణ


రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి, మంత్రులు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు తాగు, సాగునీటిని అందజేస్తున్న నారహళ్ల జలాశయానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, మంత్రులు బి.జడ్. జమీర్ అహ్మద్ ఖాన్, సంతోష్ ఎస్.లాడ్, సతీశ్ జార్కిహోళి తదితరులు సోమవారం వాయనం సమర్పించారు. సండూరు తాలూకాలో వివిధ అభివృద్ధి పథకాల ప్రారంభం, సాధన సమావేశంలో పాల్గొనేందుకు బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో జిందాల్ విమానాశ్రయానికి చేరుకున్నారు. మొదట పలువురు జిల్లా నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని స్వాగతం పలికారు. అనంతరం అక్కడే పోలీసులు గౌరవ వందనం స్వీరించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన సండూరుకు వెళ్తున్న సమయంలో నారిహళ్ల జలాశయానికి వాయనం సమర్పించిన చుట్టుపక్కల ప్రకృతి అందాలను చూసి మురిసిపోయారు. నారిహళ్ల జలాశయం గురించి మంత్రి సంతోష్ ఎస్.లాడ్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ వివరించారు. ఈ జలాశయం 0.810 టి.ఎం.సి సామర్థ్యం ఉంది. ఈ జలాశయం నుంచి పలు గ్రామాలకు తాగు, సాగునీటి అందజేస్తున్నట్లు వివరించారు. ప్రకృతి అందాలకు ఈ జలాశయం మరింత అనుకూలంగా మారిందని సీఎంకు చెప్పారు అక్కడికి వచ్చిన చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు, రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. దూరంగా కొండలపై ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు.


నారిహళ్ల జలాశయానికి వాయనం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తదితరులు

ఒకే వేదికపై గాలి సోదరుల ప్రత్యక్షం


సత్యనారాయణపేటెలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: విధానసభ ఎన్నికల్లో పరస్పరం పోటీ చేసి..కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కారణమైన రెడ్డి బ్రదర్స్ ఒకే వేదికపై మొదటి సారి ప్రత్యక్షమయ్యారు. సంగనకల్లు రహదారిలోని వాజపేయి లేఅవుట్‌లోని భాజపా కేంద్ర కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి లక్ష్మి అరుణ పాల్గొనడం విశేషం. సోమశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి మధ్యలో ఎమ్మెల్సీ ఏచ రెడ్డి సతీశ్ కూర్చున్నారు. పరస్పరం ఇద్దరు మాట్లాడుకోవడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపించింది. మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో పరస్పరం పోటీ చేసినా మేము సోదరులుగా ఎప్పటికీ ఒక్కటే..ఏదో కారణంతో మా మధ్య భేదాభిప్రాయాలు తీసుకుని రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో జిల్లాలో భాజపాకు పూర్వ వైభవం తీసుకుని రావడం తమ ముందున్న లక్ష్యమన్నారు. గాలి సోమశేఖర్‌రెడ్డి తన సోదరుడి మాటలతో ఏకీభవించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి బి.శ్రీరాములు దూరంగా ఉండిపోయారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, పార్టీ నేతలు డా.వెంకట మహిపాల్, గురులింగనగౌడ, గోనాళ్ రాజశేఖర్‌గౌడ, హెచ్.హనుమంతప్ప, ఓబళేష, మాజీ మేయర్ గుర్రం వెంకటరమణ, బుడా మాజీ అధ్యక్షులు దమ్మూరు శేఖర్, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు. పాలికె 19వ వార్డు సత్యనారాయణపేటె ప్రధాన రహదారిలో స్థానిక కార్పొరేటర్ కె.ఎస్.అశోక్, కె.ఎస్.దివాకర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి లక్ష్మిఅరుణ, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా హాజరయ్యారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను నిర్వహించారు.

బెడిసి కొట్టిన అపహరణ కుట్ర

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: విజయపురకు చెందిన ఏడుగురు యువకులతో పాటు చర్చిలో మత బోధకుడ్ని పుణెకు చెందిన కొందరు సెప్టెంబరు 29న అపహరించారు. తమకు రూ.5 కోట్లు ఇస్తేనే విడిచి పెడతామని వారి వారి కుటుంబ సభ్యులను బెదిరించారు. కర్ణాటక పోలీసులతో కలిసి పుణె పోలీసులు రంగంలోకి దిగి వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, బాధితులను రక్షించారు. రాము అప్పారే బలున్ (29), దత్త శివారీ కరే (20), హర్షద్ సురేశ్ పాటిల్ (22) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. వారు పరారీలో ఉండగా, బంధించేందుకు శోధిస్తున్నారు.

కారాగారం నుంచి బెదిరింపులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: పరప్పన అగ్రహార కారాగారం నుంచి తమకు బెదిరింపులు వస్తున్నాయని కొందరు బాధితులు వివిధ ఠాణాల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రౌడీషీటర్ జోసెఫ్ అలియాస్ బాబ్లి 2021లో హత్యకు గురయ్యాడు. ఆ కేసులో సాక్ష్యం చెప్పవద్దని కారాగారంలో ఉన్న సోమశేఖర్ నుంచి ఫోన్లు వస్తున్నాయని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కారాగారంలోకి మళ్లీ ఫోను ఎలా వెళ్లిందనే అంశాన్ని గుర్తించేందుకు సిబ్బంది సోదాలు చేపట్టారు.

సీఎం కాన్వాయ్ అడ్డుకునేందుకు విఫలయత్నం

కుడతిని భూపోరాట సమితి సభ్యులు, రైతుల అరెస్టు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి, సండూరు, కురుగోడు తాలూకాల్లో వివిధ పరిశ్రమలకు స్వాధీనం చేసుకున్న భూములకు నూతన భూస్వాధీన చట్టం ప్రకారం ధర ఇవ్వాలి. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెళ్తున్న కాన్వాయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న సంఘం సభ్యులు, రైతులను పోలీసులు అరెస్టు చేసి కుడతిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతులు, సంఘం సభ్యుల ఒత్తిడి మేరకు ముగ్గురు సభ్యులు ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేయడానికి అవకాశం కల్పించారు. కుడతిని, వేణివీరాపుం, జనెకుంటె, హరగినడోణి, యర్రంగలి, సిద్ధమ్మనహళ్లి, కొళగల్లు గ్రామాలకు చెందిన రైతుల నుంచి 13 ఏళ్ల క్రితం 12500 ఎకరాల వ్యవసాయ భూమిని తక్కువ ధరలకు లక్ష్మీమిట్టల్, బ్రాహ్మణి, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఎండీసీ కంపెనీలు స్వాధీనం చేసుకున్నాయి. నేటి వరకు పరిశ్రమలు రాకపోవడంతో రైతులు కుడతిని సమీపంలో 666 రోజులుగా నిరవధిక సత్యాగ్రహం చేస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సండూరు తాలూకాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు, సీఐటీయూ సభ్యులు తాలూకా బన్నిహట్టి గ్రామానికి చేరుకున్నారు. ఈ రహదారి మీదుగా సండూరుకు వెళ్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, మంత్రులను అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రైతులు, వివిధ స్వచ్ఛంద సంస్థ సభ్యులను అరెస్టు చేసి వాహనంలో కుడతిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతులు, సంఘం సభ్యుల ఒత్తిడి మేరకు ముగ్గురిని సండూరు పట్టణంలో జరుగుతున్న బహిరంగ సమావేశం వద్దకు పోలీసులు తీసుకెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రిని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. నూతన భూస్వాధీన చట్టం ప్రకారం కోర్టు ఆదేశాలు జారీ చేసినా..నేటికీ ఇవ్వడం లేదు. 13 ఏళ్ల క్రితం స్వాధీనం చేసుకున్న భూములతో రైతులు ఉపాధి కోల్పోయారు. సుమారు పదేళ్ల నుంచి భూములు కోల్పోయిన ఒక్కొక్క రైతు కుటుంబానికి నెలకు రూ.25వేలు పరిహారం అందజేయాలి. పరిశ్రమలు స్థాపించక పోతే....స్వాధీనం చేసుకున్న రైతులకే భూములను వెనిక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం సభ్యులు సత్యబాబు, శివశంకర్, బసవరాజు, చెన్న బసవ, హనుమంతప్ప, జంగ్లిసాబ్, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, ఎ.స్వామి పాల్గొన్నారు.


మహిళా రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు


బన్నిహట్టి గ్రామం వద్ద మహిళ రైతుల నిరసన


రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మంగళముఖిలనూ మనుషులుగా చూడండి


పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మంగళముఖిలు

హొసపేటె, న్యూస్‌టుడే: సమాజంలో మంగళముఖిలను ప్రజలు, ప్రభుత్వాలు అసలు మనుషులుగా చూడటంలేదని పద్మశ్రీ పురస్కార గ్రహీత మాతా మంజమ్మ జోగతి వాపోయారు. పలు సంఘాల మద్దతుతో సోమవారం జిల్లాలోని మంగళముఖిలు పట్టణంలో చేపట్టిన స్వాభిమాన నడక కార్యక్రమంలో మంజమ్మ పాల్గొని మాట్లాడారు. సమాజంలో మంగళముఖిలు మనుగడకు నానా తంటాలు పడుతున్నారు. రోజూ అవమానాల పాలవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మంగళముఖిలను గుర్తించి వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎంతమంది మంగళముఖిలు ఉన్నారన్న సరైన గణాంకాలు ప్రభుత్వం వద్ద లేవని తేల్చిచెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళముఖిల సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సముదాయం సంక్షేమానికి ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి కోసం ఈ సముదాయం అలమటిస్తోందని అన్నారు. పట్టణంలోని వడకరాయ ఆలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకూ స్వాభిమాన నడక కార్యక్రమం జరిగింది. ప్రముఖులు నిషాగూళూరు, మనోహర్, రాజేశ్, శైనాజ్, సణ్ణమారెప్ప, వీణ, సుధా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాభివృద్ధికి సమన్వయం అవసరం


అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా బాధ్య కార్యదర్శి, గృహనిర్మాణ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్‌రాజ్ సింగ్

హొసపేటె, న్యూస్‌టుడే: జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, శాఖల నడుమ సమన్వయం చాలా అవసరమని విజయనగర జిల్లా బాధ్య కార్యదర్శి, గృహనిర్మాణ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్‌రాజ్ సింగ్ పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. చౌకడిపో సరకు నల్లబజారులో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి, వాటిని వెంటనే నియంత్రించాలని సూచించారు. గృహజ్యోతి పథకంలో 90 శాతం మంది వినియోగదారులు పేర్లను నమోదు చేసుకోవడం హర్షదాయకం, మిగిలిన శాతాన్ని వెంటనే పూర్తిచేయాలని సూచించారు. గృహలక్ష్మీ పథకంలో మహిళల ఖాతాలకు డబ్బులు జమ అవుతున్నాయి, ఎవరూ సంశయ పడాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అంగన్‌వాడీ, వసతి నిలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్.మొహ్మద్ అలి అక్రంషా తదితరులు పాల్గొన్నారు.

కిత్తూరు కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైలు

హొసపేటె, న్యూస్‌టుడే: కిత్తూరు కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 16 నుంచి ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు నైరుతి రైల్వే వినియోగదారుల సలహా సమితి సభ్యుడు బాబులాల్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. వారానికి నాలుగుసార్లు ఈ రైలు సంచరిస్తుంది. ఆదివారం, మంగళవారం, బుధవారం, శనివారం బెళగావినుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరే ఈ రైలు (సంఖ్య:07335) ఖానాపుర, గదగ, కొప్పళ, హొసపేటె, బళ్లారి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, యాదగిరి, వికారాబాద్ గుండా మరుసటి రోజు మధ్యాహ్నం 12.40 గంటలకు మణగూరు చేరుకుంటుంది. సోమవారం, బుధవారం, గురువారం, ఆదివారాల్లో మణగూరు నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరే ఈ రైలు (సంఖ్య:07336) వ్యతిరేక మార్గాల్లో ప్రయాణించి మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు బెళగావి చేరుకుంటుంది. ఈ రైలును నడపాలని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి వి.సోమణ్ణను కోరడంతో ఆయన స్పందించారని బాబులాల్‌జైన్ కృతజ్ఞతలు తెలిపారు.

విజయనగర కాలపు శిలాశాసనం లభ్యం

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర సామ్రాజ్యపు కాలం నాటి ఓ శిలాశాసనం, మరికొన్ని మాస్తిశిలలు హొసపేటె తాలూకా ముద్లాపురలో వెలుగు చూశాయి. కన్నడ వర్సిటీకి చెందిన సహప్రాధ్యాపకుడు డాక్టర్ కృష్ణేగౌడ, అభివృద్ధి అధ్యయన విభాగం డాక్టర్ గోవర్ధన్, బళ్లారి వర్సిటీ చరిత్ర విభాగానికి చెందిన ప్రాధ్యాపకులు తిప్పేస్వామి, వీరాంజనేయ, డాక్టర్ గోవిందతో కూడిన విజయనగర పర్యటన బృందం ఈ అపూరూప శాసనాలను వెలుగులోకి తీసుకొచ్చింది. మాస్తిగల్లు (మహాసతి శిల) చాలా అరుదైందని పరిశోధక బృందం ప్రముఖుడు డాక్టర్ గోవింద తెలిపారు. శైవ విన్యాసంలో ఈ మహాసతి శిలను చెక్కినట్లు వివరించారు. రాజు లేదా పాళేగాళ్ల సతికి సంబంధించిన శిలగా భావిస్తున్నారు. సాధారణ మహిళలైతే తలపైన కిరీటం ఉండదు. ఈ మహాసతి శిలలో తలపై కిరీటం ఉండటంతో ప్రముఖుల సతిగా భావిస్తున్నారు. లభ్యమైన మరో శాసనం కొంత అస్పష్టంగా ఉంది. కృష్ణదేవరాయ సతీమణి చిన్నాంబికె పేరుతో హొసపేటెలో చిత్తవాడ్గీ ప్రాంతం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ముద్లాపురలో దొరికిన శాసనాలు విజయనగర రాజుల కాలంనాటివి అని డాక్టర్ గోవిందు పేర్కొన్నారు. వీటిని సంబంధించిన కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖలు సంరక్షణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.


హొసపేటె తాలూకా ముద్లాపురలో దొరికిన శిలాశాసనం


వెలుగులోకి వచ్చిన మాస్తిశిల

విభేదాలు మరిచి పండగ ఆచరణ

మాన్వి, న్యూస్‌టుడే: అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎప్పుడూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం పరిపాటి. ఈసారి జరిగిన శమీ పూజ్యోత్సవంలో అందుకు విరుద్ధంగా జరిగింది. ఎమ్మెల్యే హంపయ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ ఇద్దరూ శమీ పూజలో పాల్గొన్నారు. పరస్పరం శమీ పత్రిని పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వారిద్దరూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శమీ పూజలో పార్టీలకతీతంగా పాల్గొనడంపై పట్టణవాసుల్లో ఆనందం వ్యక్తం చేశారు. పురపాలక సంఘం ముఖ్యాధికారి గంగాధర్, యువ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా రామచంద్రనాయక్, పురపాలక సంఘం సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

భక్తిశ్రద్ధలతో శ్రీదేవి రథోత్సవం

కారటగి, న్యూస్‌టుడే: కారటగి జేపీనగర్‌లో శ్రీదేవి రథోత్సవం ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తుల జయ, జయ ధ్వనుల మధ్య మహిళలు రథాన్ని ఆలయం నుంచి కనకదాస కూడలిలోని పాదగట్టె వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ప్రజలు భక్తితో రథానికి పూలు, పండ్లు సమర్పించుకున్నారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న మహిళలు

దేవమ్మకు కుంకుమార్చన

కారటగి, న్యూస్‌టుడే: కారటగి గ్రామ దేవత దేవమ్మ దేవి ఆలయంలో సోమవారం కుంకుమార్చన తదితర పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం అభిషేకం అనంతరం అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. పూజలకు మరుళ సిద్ధయ్య స్వామి నేతృత్వం వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు.


కారటగి దేవమ్మ దేవి

హిరియూరులో రూ.12 కోట్లతో రహదారుల విస్తరణ

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు పట్టణంలో రూ. 12.17 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ అతిథి గృహం కూడలి నుంచి తాలూకా కార్యాలయం మీదుగా బెంగళూరు బైపాస్ రహదారి వరకు రహదారుల విస్తరణ పనులను చేపట్టనున్నట్లు జిల్లా బాధ్యమంత్రి డి.సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన హిరియూరులో రహదారుల విస్తరణ పనులకు భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి అమృత్ నగరోత్థాన పథకం కింద ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. పట్టణంలో ప్రధాన రహదారులను విస్తరించడమే కాకుండా మధ్యలో విభాజకాలను ఏర్పాటు చేసి, విద్యుత్తు దీపాలను అమరుస్తామని చెప్పారు.


రహదారుల విస్తరణ పనులకు భూమిపూజ చేస్తున్న జిల్లా బాధ్యమంత్రి సుధాకర్

వాల్మీకి భవన నిర్మాణానికి రూ.4కోట్లు

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా కేంద్ర స్థానం హొసపేటెలో వాల్మీకి భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4కోట్లు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గిరిజన వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపడతారు. విజయనగర జిల్లాలో వాల్మీకి సముదాయానికి చెందిన ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వాల్మీకి భవన నిర్మాణ ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం రూ.4కోట్లను కేటాయించింది. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని విజయనగర జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ గిరిజన వర్గాల సంక్షేమశాఖ సంచాలకుడికి ఉత్తరం రాశారు. నిధులు విడుదలైన వెంటనే నిర్మాణం పనులు చేపడతారు.

17న వాల్మీకి జయంతి

బళ్లారి : జిల్లా యంత్రాంగం, పంచాయతీ, నగర పాలికె, గిరిజన సంక్షేమ శాఖ, కన్నడ సంస్కృతిశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు స్థానిక నల్లచెరువులోని వాల్మీకి భవనంలో వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్నట్లు అధికారి నాగరాజ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్య మంత్రి బి.జడ్ జమీర్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, మేయర్ ముల్లంగి నందీష్, బుడా అధ్యక్షుడు జె.ఎస్.ఆంజనేయులు, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూర, ఎస్పీ శోభారాణి తదితరులు పాల్గొంటారన్నారు.

హెచ్చెల్సీలో పడి వ్యక్తి గల్లంతు

బళ్లారి, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హొసపేటె తాలూకా కడ్డి రాంపురం గ్రామానికి చెందిన యమన నాయక్(45) వ్యక్తి బళ్లారి నగరం బండిహట్టి సమీపంలోని యల్లమ్మ దేవస్థానం వద్ద హెచ్చెల్సీ కాలువలో దూకి గల్లంతైనట్లు కుటుంబసభ్యులు బళ్లారి కౌల్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యమన నాయక్ 5 అడుగుల ఎత్తు, గుండ్రని ముఖం, గోధుమ రంగు, సాధారణ శరీరాకృతి, తదితర గుర్తులు ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.


యమన నాయక్

బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

హొసపేటె, న్యూస్‌టుడే: బైకులు పరస్పరం ఢీకొని ఇద్దరు చోదకులకు గాయాలైన ఘటన కొట్టూరు తాలూకా దూపదహళ్లి సమీపంలో సోమవారం జరిగింది. హగరిబొమ్మనహళ్లి నుంచి కొట్టూరు వైపు వెళుతున్న తిప్పేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ కొట్టూరు ఆసుపత్రిలో దాఖలు చేశారు. రహదారి మధ్యలో ఏర్పడిన గోతిని తప్పించబోయి రెండు బైకులు ఒకటినొకటి ఢీకొన్నాయని ఘటనా స్థలాన్ని పరిశీలించిన కొట్టూరు పోలీసులు తెలిపారు.

ఉద్యోగుల సంఘానికి 13 నామినేషన్ల దాఖలు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నిర్వహించే ఎన్నికలకు సంబంధించి మొత్తం 13 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి దేవేంద్రే గౌడ పేర్కొన్నారు. సోమవారం పది నామినేషన్లు దాఖలు చేయగా, ఇంతకు ముందు 3 నామినేషన్లు దాఖలు అయ్యాయి. 18న నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి తేదీ అని ఆయన చెప్పారు.

సేవాభావం అలవర్చుకోండి

కంప్లి : సమాజంలో ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వహిస్తూ సమాజ సేవకు తమ వంతుగా ముందుకు రావాలని హెచ్.వీరాపుర జ్ఞానజ్యోతి శివలింగ మందిర జడేశ తాత సూచించారు. తాలూకాలోని ఎమ్మిగనూరు పేటె బసవేశ్వర ఆలయ సముదాయ భవనంలో జడిసిద్ధేశ్వర ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ సంఘాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ వ్యాపారంలోనైనా వినియోగదారుడు దేవుడు. వినియోగదారుడ్ని మోసం చేసే ప్రయత్నం చేయొద్దన్నారు. సంఘం అధ్యక్షుడు ఎం.జడేశ స్వామి సంఘం ఏర్పాటు గురించి వివరించారు. గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు గాదిలింగప్ప, సభ్యుడు లోకేశ్, సంఘం ఉపాధ్యక్షుడు శివాజీ, చిప్పిగర జడేశ్, రాఘవేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.


సంఘాన్ని ప్రారంభిస్తున్న జడేశ తాత

ఘోర ప్రమాదం: ముగ్గురి దుర్మరణం

మాన్వి, న్యూస్‌టుడే: సిరివార తాలూకా పరిధి కల్లూరు సమీపంలో కారు, లారీ ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్వి పట్టణానికి చెందిన మెకానిక్‌లు యాసిన్ (21), మక్బుల్ (24), చోదకుడు హర్షద్ (23) సోమవారం సాయంత్రం కారులో రాయచూరు బయలుదేరారు. కల్లూరు సమీపంలో రాయచూరు- సింధనూరు ముఖ్య రహదారి 23పై వేగంగా వచ్చిన లారీ యువకులు ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొంది. ఆ ధాటికి కారు ముందు వైపు సగభాగం లారీ లోపలికి దూసుకుపోయింది. కారు ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని అతికష్టంపైన జేసీబీ సాయంతో కారును అందులో ఇరుక్కున్న మూడు మృతదేహాలను బయటికి తీశారు. సిరివార పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

14-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.97	1614.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	82504	714
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	82324	9258
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.656	47.059

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

చరిత శోధన.. ఖ్యాతి సాధన

✦ గనినాడులో జర్మనీ దేశ పరికరాల ప్రదర్శన ✦ పరిశోధన విద్యార్థులకు ఉపయుక్తం


రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగనకల్లు మ్యూజియం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం డా.రాజ్‌కుమార్ రహదారిలోని కన్నడ సముచ్ఛయ భవనం ఆవరణలోని రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగనకల్లు మ్యూజియంలో జర్మనీ దేశంలో లభించిన సింహం పోలిన మనిషి, స్త్రీని పోలిన వస్తువులను ప్రదర్శించారు. మ్యూజియంలో ఇప్పటికే పురాతన వస్తువులు, చరిత్ర పూర్వం కళాఖండాలు, శిలాయుగంలో మానవులు ఉపయోగించిన పరికరాలు, ఆయుధాలు, శవపేటిక, జంతువులను వేటాడడానికి రాళ్లతో తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. వీటిపై భారత్‌తోపాటు ఇతర దేశాలకు చెందిన పలువురు విద్యార్థులు పరిశోధనలు చేసి పీహెచ్‌డీలు సైతం పొందారు. మరో అడుగు ముందుకు వేసి మ్యూజియంలో జర్మనీలో లభించిన సింహం పోలిన మనిషి, మహిళ దేహం పోలిన ఆకృతులను ప్రదర్శించారు. జర్మనీ దేశంలోని స్టాడెల్‌జిల్ పట్టణంలోని ఒక గుహలో సింహం తలను పోలిన మనిషి ఆకృతులను కనుగొన్నారు. ఇవి సుమారు 40 వేల సంవత్సరాల క్రితం నాటివని పరిశోధనలో గుర్తించారు. డాల్ఫ్ వెస్టోన్సైస్ అనే ప్రాంతంలో వీనస్ స్త్రీ (మాత దేవత) ఆకృతులను కనుగొన్నారు. ఇవి సుమారు 31,000 సంవత్సరాలు నాటివిగా గుర్తించారని తెలిపారు.


జర్మనీలో లభించిన సింహం పోలిన మనిషి ఆకృతులను డీసీకి చూపిస్తున్న సభ్యుడు ఆహిరాజ్

దేశంలోనే ఏకైక మ్యూజియం

భారతదేశంలోనే పురాతన చరిత్రకు అంకితం చేసిన ఘనత బళ్లారి రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగనకల్లు మ్యూజియందేనని చెప్పవచ్చు. ఐరోపా దేశానికి చెందిన పలు పురాతన అస్థి పంజరాలను ఇప్పటికే ప్రదర్శించగా, జర్మనీ దేశానికి చెందిన సింహంతలను పోలిన మనిషి ఆకృతులు, స్త్రీని పోలిన ఆకృతులను తాజాగా ఇక్కడ ప్రదర్శించారు.

ఆఫ్రికా దేశంలోని రాతి పరికరాలు

కొన్ని నెలల క్రితం ఆఫ్రికా దేశంలో లభించిన పాత రాతియుగం నాటి రాతి పరికరాల నమూనాలను సేకరించి ఈ మ్యూజియంలో ప్రదర్శించారు. లండన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో లభించిన వివిధ రకాల రాతి పరికరాలను త్రీడీ నమూనాలను సేకరించారు. ఆకృతులు, ఉపకరణాలను న్యూయార్క్‌కు చెందిన నవిత, సుగంధి, రవి కోరిశెట్టర్ సేకరించారు. హునాసిగిలో లభించిన అతి పురాతన రాతి పరికరాలను పుణెలోని దక్కన్ కళాశాల బళ్లారి మ్యూజియంకు అందజేసింది. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలోని ఇసాంపుర గ్రామానికి చెందిన డా.కె.పెద్దయ్య లభించిన రాతి పరికరాలనూ బళ్లారి మ్యూజియంకు తరలించారు. ఈ విధంగా సేకరించిన రాతి యుగం, ఆఫ్రికా దేశంలో లభించిన వస్తువుల ఆధారంగా చరిత్రపై లోతైన పరిశోధన చేయడానికి పరిశోధక విద్యార్థులకు ఉపయోగపడనుంది.


రాతియుగంలో ఉపయోగించిన వస్తువులు

వస్తువులను పరిశీలించాం

దేశంలోనే బళ్లారి రాబర్ట్ బ్రూస్ ఫుట్ సంగనకల్లు మ్యూజియంకు ప్రత్యేక గుర్తింపు ఉంది. జర్మనీలో లభించిన సింహం తలను పోలిన మనిషి, స్త్రీని పోలిన వస్తువులను ఇక్కడికి తెచ్చారు. ఇప్పటికే దేశానికి చెందిన పలువురు విద్యార్థులే కాకుండా విదేశాలకు చెందిన విద్యార్థులు పరిశోధనలు చేసి పీహెచ్‌డీలు పొందారు. ప్రస్తుతం జర్మనీ దేశంలో లభించిన వస్తువులు పరిశోధకులకు సరికొత్త అధ్యయనాలకు ఉపయోగపడతాయి.

- ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా పాలనాధికారి, బళ్లారి

న్యాయమూర్తి కాంతరాజ్ నివేదిక అమలు చేయండి

హొసపేటె, న్యూస్‌టుడే: నిపుణుడు కాంతరాజ్ నివేదిక వెంటనే అమలు చేయడంతో పాటు, వెనుకబడిన వర్గాలకు శాస్త్రీయంగా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయనగర జిల్లా వెనుకబడిన వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆందోళనకు నేతృత్వం వహించిన వై.యమునేశ్, రవిశంకర్ తదితరులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం చిన్నప్పరెడ్డి నివేదిక ఆధారంగా నేటికీ వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడంతో ఆ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. కొత్తగా న్యాయమూర్తి కాంతరాజ్ నివేదిక ప్రభుత్వం ముందు ఉన్నప్పటికీ, జారీలోకి తీసుకురాకుండా చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. జారీ చేయకముందే అధికార, ప్రతిపక్షాల్లో కొందరు నివేదికపై భిన్నస్వరాలు వినిపించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ ప్రభుత్వానికి నిజంగా ప్రజల సంక్షేమం కోరుతుంటే వెంటనే కాంతరాజ్ నివేదికను జారీ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రముఖులు ఎం.పంపణ్ణ, వై.మధుసూదన్, విరుపాక్షప్ప పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వెనుకబడిన వర్గాల సమాఖ్య ప్రతినిధులు


తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

డీసీ జోక్యం చేసుకోవాలని వినతి

సింధనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి జరుగుతున్న ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి.. తక్షణం జిల్లాధికారి జోక్యం చేసుకుని సరిచేయాలని ప్రభుత్వ ప్రాథమిక, ప్రౌఢశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాధికారి, ఏసీ, తహసీల్దారుకు సిట్టింగ్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్ హిరేమఠ్ చేస్తున్నది దురహంకార ధోరణి అని సోమవారం ఫిర్యాదు చేశారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగుల్లో అత్యధిక ఓట్లు ఉన్నది విద్యాశాఖ. ప్రతిసారి ఈ శాఖకు నాలుగు స్థానాలు కేటాయించే వారు. ఈసారి రెండే స్థానాలకు కుదించారని సిట్టింగ్ అధ్యక్షుడిపై ఆరోపణలు గుప్పించారు. ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నాయి. 18 నామపత్రాలు సమర్పించడానికి ఆఖరుతేదీ. మాకు నాలుగు రోజుల వ్యవధిలో తమ విద్యా శాఖ ఓటర్ల జాబితాను ఇచ్చారని తెలిపారు. తాలూకాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో మొత్తం నాలుగు వేల వరకూ ఓటర్లు (ప్రభుత్వ ఉద్యోగులు) ఉన్నారు. మొత్తం జాబితాను కోరితే ఇవ్వట్లేదని దుయ్యబట్టారు. ఇప్పటికే రెండుసార్లు అధ్యక్షుడిగా ఏలుబడి సాగించి.. మూడోసారి కూడా కన్నేసిన చంద్రశేఖర్ దురహంకారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులను తన కనుసైగల్లో ఉన్నవారినే నియమించడం వల్ల..మా వేదన వినేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవంగా ద్యావమ్మ దేవి రథోత్సవం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: దాసాపుర గ్రామంలో ద్యావమ్మ దేవి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సిరిగేరి పిర్కా దాసాపుర గ్రామంలో ఆలయ ప్రాంగణంలో దేవి పురాణ ప్రవచన ముగింపు, అమ్మవారి ప్రథమ రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ఆచరించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని గంగా, గణేశ, ఉమామహేశ్వర, పంచకళల నవగ్రహ పూజలు, హోమాలు, పూర్ణాహుతి, నూతన రథానికి కళాశారోహన, సింహ మండప తదితర కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని చేపట్టారు.


సిరుగుప్ప దాసాపుర్‌లో ద్యావమ్మ దేవి రథోత్సవం

శాంభవి మాతకు విశేష పూజలు

సిరివార (మాన్వి), న్యూస్‌టుడే: సిరివార తాలూకా నవలకల్ బృహన్మఠాన్ని సోమవారం సాయంత్రం రాష్ట్ర చిన్ననీటి, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా బోసురాజు మాట్లాడుతూ పండగలు, విశేష సందర్భాల్లో తాము తప్పకుండా నియోజకవర్గంలోని అన్ని మఠాలను సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారికి పూజలు చేస్తే ఎంతో ఉత్తేజం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ క్షేత్రంలోని మఠాలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నాయని గుర్తుచేశారు. అనంతరం మఠంలో మంత్రి, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. మఠాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మఠానికి వచ్చిన నాయకులను అభినవ సోమనాథ్ శివాచార్య స్వామి ఘనంగా సత్కరించారు.


మంత్రి బోసురాజును సన్మానిస్తున్న స్వామి

సిద్ధరామేశ్వర మఠంలో మహోత్సవం: తాలూకాలోని హీరా గ్రామంలో ప్రసిద్ధి చెందిన సిద్ధరామేశ్వర మఠం ఆధ్వర్యంలో సోమవారం మంత్రి బోసురాజు దసరా ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జంబూ సవారీ నిర్వహించారు. వివిధ కళాకారుల బృందాల ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, సిరివార పట్టణ పంచాయతీ అధ్యక్షుడు భూపనగౌడ, కాంగ్రెస్ నాయకులు చుక్కిసూగప్ప సాహుకార్, శాంతప్ప, శరణయ్య నాయక్ గుడదిన్ని, రమేష్ దర్శన్‌కర్, గంగాధర్‌స్వామి, రుద్రప్ప, శివమూర్తి, అమరేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మిఠాయిలు పంచుకుంటున్న అభిమానులు

నాగేంద్రకు బెయిలు.. అభిమానుల సంబరాలు

బళ్లారి, న్యూస్‌టుడే: ఎస్టీ కార్పొరేషన్ మండలి నిధుల మళ్లింపు కేసులో బెంగళూరు జైల్లో ఉన్న మాజీ మంత్రి, గ్రామీణ శాసనసభ్యుడు బి.నాగేంద్రకు సోమవారం బెయిలు లభించడంతో అభిమానులు, కార్యకర్తలు, నేతలు సంబరాలు జరుపుకొన్నారు. కె.పి.సి.సి వ్యాఖ్యాత వెంకటేశ్ హెగ్డె నేతృత్వంలో పార్టీ నేతలు గుడుదూర్ హనుమంతు, సంగనకల్లు విజయకుమార్, కార్యకర్తలు కెంచప్ప, దివాకర్, రాఘవేంద్ర, రామచంద్ర, సురేశ్, ఉమేస, వెంకటేష్, రాముడు తదితరులు స్థానిక గడిగి చెన్నప్ప కూడలికి చేరుకుని బాణ సంచా పేల్చుతూ స్థానికులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేదావతి నదిలో పెరిగిన వరద

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొసదుర్గం తాలూకా పొరుగున ఉన్న చిక్కమగళూరు జిల్లాలోని అజ్జంపుర, కడూరు, తరికెర తదితర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో వేదావతి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో నదిలో వరద నీటి ప్రవాహం 1040 క్యూసెక్కులకు చేరుకొందని అధికారులు తెలిపారు. వాణివిలాస్ సాగర్ జలాశయం నీటి స్థాయి 122.35 అడుగులకు చేరుకొందని, ప్రస్తుతం జలాశయంలో 24 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు చెప్పారు. వి.వి.సాగర్ జలాశయం గరిష్ఠ నీటి సామర్థ్యం 130 అడుగులు కాగా, గరిష్ఠంగా 30 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. హొసదుర్గం తాలూకా కెల్లోడు వద్ద వేదావతి నదికి అడ్డంగా నిర్మించిన బ్యారేజి నిండటంతో వరద నీరు దిగువన వి.వి.సాగర్ జలాశయానికి ప్రవహిస్తోంది. వి.వి.సాగర్ నుంచి హిరియూరు, చెళ్లకెర, మొళకాల్మూరు తాలూకాల్లో వేలాది ఎకరాలకు సాగు నీరు అందుతోంది. హిరియూరు, చెళ్లకెర, చిత్రదుర్గం పట్టణ ప్రజలకు, నాయకనహట్టి వద్ద గల డీఆర్‌డీవో, ఐఐఎస్సీ, ఇస్రో తదితర కేంద్ర సంస్థలకు ఇక్కడి నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు.


బ్యారేజిపై నుంచి వి.వి.సాగర్ జలాశయానికి తరలిపోతున్న వరద నీరు

సమస్యల పరిష్కారానికి కృషి

కారటగి, న్యూస్‌టుడే: పట్టణంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తామని కారటగి పురసభ ముఖ్యాధికారి సురేశ్ తెలిపారు. పట్టణంలోని 18వ వార్డు సభ్యుడు ఎం.ఆనంద్, సిబ్బందితో కలిసి సోమవారం ఆయన పర్యటించి అక్కడి సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడి దోమలు అధికమయ్యాయి. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు తెలుపగా ఆయన పై విధంగా స్పందించారు. మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ జల్లుతామని, దోమల నియంత్రణకు ఫాగింగ్ జరుపుతామని అధికారి తెలిపారు. వార్డులో మూడు అంగన్వాడీ కేంద్రాల్లో 111 మంది శిశువులు ఉన్నారు. ఒక్క కేంద్రానికీ సొంత భవనం లేదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సొంత భవనాల నిర్మాణానికి ప్రయత్నిస్తామని అధికారి పేర్కొన్నారు.


వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పురసభ ముఖ్యాధికారి


సింధనూరు అంతటా పచ్చదనంతో కళకళలాడుతున్న వరి పైరు


తుంగభద్ర కాలువల్లో నీటి గలగలలు

వరి పైరు.. సాగు జోరు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా అంతటా వరిపైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. అన్నదాతలు సైతం ప్రశాంతచిత్తంతో ఉన్నారు. కాలువల్లో నీటి సమస్యలు పెద్దగా లేవు. వరిపైరుకు చీడపీడలు, రోగాల బాధలు అంతగా లేవు. గతంలో మాదిరి కాకుండా ధర ఎక్కువగా ఉన్నా..ఎక్కువ రోజులు నియంత్రణ సామర్థ్యం గల కీటనాశకాలు అందుబాటులో ఉన్నందున రైతులు ధైర్యంగానే ఉన్నారు. సింధనూరు తాలూకాలో అక్కడక్కడ ఆర్ఎన్ఆర్ రకం సాగు ఉన్నా..అగ్రభాగం మాత్రం బంగారంతో సమానంగా భావించే సోనా మసూరిదే. ప్రస్తుతం పైర్లకు ఈనెలు కనిపిస్తున్నాయి. ఇంకో నెల రోజులకు ఇవి పాలు పోసుకుని గింజలు కడతాయి. అడపాదడపా వానలు కురవడం..జలాశయానికి అక్టోబరులో కూడా ఇన్‌ఫ్లో కొనసాగడంతో కాలువల్లో నీరు సమృద్ధిగానే పారుతుండటంతో పైర్లు కళకళలాడుతున్నాయి. వచ్చే నెల చివరి వారానికి లేదా డిసెంబరు మొదటి వారానికి పంట చేతికి అందుకుంటామని రైతులు చెబుతున్నారు. రెండో పంటకు సైతం ఢోకా లేదని కనపడుతున్నందున నారు పోసుకోడానికి కొంతమేర పొలాన్ని ఇప్పటికే సిద్ధంగా ఉంచుకున్నామని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రేపు జిల్లాధికారి కార్యాలయం ఎదుట ధర్నా

కారటగి, న్యూస్‌టుడే: దళిత రిజర్వేషన్లను వర్గీకరించాలని డిమాండు చేస్తూ ఈనెల 16న కొప్పళ జిల్లా పాలనాధికారి కార్యాలయం ముందు ధర్నా జరపతలపెట్టామని దళిత రిజర్వేషన్ల వర్గీకరణ పోరాట సమితి రాష్ట్ర సంఘటనా కార్యదర్శి బి.హుసేనప్ప స్వామి మాదిగ తెలిపారు. కారటగిలో సోమవారం ఆయన ధర్నా పోస్టర్లను ప్రదర్శించి విలేకరులతో మాట్లాడారు. దళితులు అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నారు. వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. దళిత వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. మాదిగ దండోరా సమితి జిల్లా అధ్యక్షుడు డి.మల్లేశ్ దూదగుంప, రిజర్వేషన్ల పోరాట సమితి తాలూకా అధ్యక్షుడు శివప్ప మాదిగ మాట్లాడారు. నాయకులు కరియప్ప, హనుమంతప్ప, నాగరాజ గుండూరు పాల్గొన్నారు.


కారటగిలో ధర్నా పోస్టర్లను ప్రదర్శిస్తున్న దళిత సముదాయ నాయకులు

ప్రాణాలు తీసిన ద్విచక్రవాహనం

బీదర్, న్యూస్‌టుడే: సినిమా స్టంట్ తరహాలో బసవకల్యాణ తాలూకా శివార్లలో సంభవించిన రోడ్డుప్రమాదంలో గుల్లాంట్ గైక్వాడ్ (40) అనే వ్యక్తి, అజయ్ (21) అనే యువకుడూ మరణించారు. తన బైక్‌పై వేగంగా వస్తున్న సమయంలో అదుపు తప్పి అజయ్ కిందపడిపోయాడు. బైకు రహదారిపై వేగంగా జారుకుంటూ వచ్చి గుల్లాంట్ గైక్వాడ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మరణించగా, బైకు మంటల్లో కాలిపోయింది. బసవకల్యాణ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ బాలింత మరణం

యాదగిరి, న్యూస్‌టుడే: కాన్పు కోసం శహపుర తాలూకా ఆసుపత్రిలో చేరిన భవాని (26)కి వైద్యురాలు సరోజ పాటిల్ శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత నిర్వహించిన రక్త పరీక్షల్లో ఆమెకు కామెర్లు ఉన్నట్లు గుర్తించారు. రక్తస్రావం నిలవకపోవడంతో కలబురగిలోని యునైటెడ్ ఆసుపత్రిలో చేర్పించారు. శస్త్రచికిత్స చేసి కుట్లు సరిగా వేయలేదని ఆ ఆసుపత్రి వైద్యులు ఆమెకు మళ్లీ ఇతర చికిత్స పేరిట రూ.10 లక్షల బిల్లును ఇచ్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండని మహారాష్ట్రలోని సొల్లాపురలో చికిత్సకు తీసుకు వెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. ఆమెను అక్కడ చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించింది. శహపుర తాలూకా దోరనహళ్లి గ్రామంలో ఆమె మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

రంగోలి.. జానపద రవళి!

రాజధానిలో అ'పూర్వ' కళాతేజం

అటు చూస్తే లాల్‌బాగ్.. ఇటు చూస్తే కబ్బన్ వనం! ఉల్లాసంగా గడపడానికి ఎటెళ్లాలో తెలియదు సామాన్యుడికి. మరోవైపు విధానసౌధ.. ఇటు వంక హైటెక్‌సిటీ.. విహారానికి ఏది ఉత్తమమో తేల్చేలోగా.. రా.. రమ్మని అందరినీ ఆహ్వానిస్తోంది 'రంగోలి' జానపదల లోగిలి! ఆ అందాల ఆస్వాదన.. మధురానుభూతికి దర్పణం.



పల్లెసీమల్లో కనవచ్చే బడి నమూనా



ఇప్పటికీ ఉత్తర కర్ణాటకలో కనవచ్చే 'చిల్లర దుకాణం'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: హైటెక్ సిటీలో గ్రామీణ వాతావరణాన్ని తలపించే ఓ చక్కని కేంద్రం అందరినీ ఆకట్టుకుంటోంది. పల్లెసీమల అందాలను నేటి నగరవాసికి వివరించడానికి జక్కూరులోని 'రంగోలి గ్రామీణ' వాటిక వాలాల్సిందే. ఆ ఊహా లోయల గ్రామంలోకి అడుగుపెడితే అందరూ విస్మయానందాలకు లోనవుతారు. గ్రామాల నుంచి నగరానికి వచ్చిన వృద్ధులకు పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి. నేటితరానికి గ్రామాలు, వాటిలో నివసించే వారి జీవనం, చేతివృత్తులు, రచ్చబండ, క్రీడలు, బాలల ఆటలు, పాఠశాల, పశువుల పెంపకం, వ్యవసాయం తదితర వాటిని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఇంధన అభివృద్ధి సంస్థ ఈ రంగోలి గ్రామాన్ని అభివృద్ధి చేసింది. పాతకాలం నాటి ఇళ్లు, వసారాలు, చావడి, పశువుల కొట్టాలు, కస్సీ పండేల లోగిలి, తీర్పులు చెప్పే రచ్చబండ.. తదితర వాటిని తీర్చిదిద్దారు. ఆసనమైన బొమ్మలను అమర్చి జీవకళ ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. బిడ్డలకు స్నానం చేయించడం, తొక్కుడు బిళ్ల ఆటగాళ్లు, బార ఆటల్లో నిమగ్నమయ్యే బాలలు, బడికి వెళ్తున్న విద్యార్థులు, ఇంటి ముందుకు వచ్చి భవిష్యత్తును చెప్పే జంగమ దేవర, మలనాడులో ఖ్యాతి పొందిన కంబళ క్రీడ.. తదితరాలను బొమ్మల రూపంలో ప్రదర్శిస్తున్నారు. రంగోలి గ్రామంలోకి అడుగుపెడితే ఏదో అనుభూతి కలుగుతోందని పర్యాటకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటారు. నగరంలో పుట్టి, పెరుగుతున్న బాలలకు అన్నం ఎలా పండిస్తారోననేది అవగాహన కల్పించేందుకు ఉపకరించే వరి సేద్యం, పాల ఉత్పత్తికి ఆవులు, కూరగాయల సాగు భూమి.. తదితరాలు ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ఆకట్టుకునే చిల్లర దుకాణాలు, ఆహార ధాన్యాలను శుద్ధి చేసే పనులు.. ఇలా ఎన్నెన్నో తెలుసుకోవచ్చని నిర్వాహక సంస్థ అధికారులు వివరించారు. పర్యాటక శాఖ దీన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు పథకాలను సిద్ధం చేసింది. నగరానికి వచ్చే పర్యాటకులు కబ్బన్‌పార్క్, లాల్‌బాగ్, విధానసౌధ తదితర ప్రాంతాలను తిలకించినట్లు ఈ రంగోలి గ్రామాన్ని వీక్షించేలా ప్రచారం ముమ్మరం చేయనున్నారు. ఈ ప్రాంగణంలోకి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు అనుమతిస్తారు.



చూడగానే ఆకట్టుకునే రంగోలి గ్రామం ఇదే



గ్రామీణుల తగాదాలను తెంచే 'రచ్చబండ'



ప్రతి లోగిలీ ఓ మధురానుభూతికి దర్పణం

బెడిసి కొట్టిన అపహరణ కుట్ర

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: విజయపురకు చెందిన ఏడుగురు యువకులతో పాటు చర్చిలో మత బోధకుడ్ని పుణెకు చెందిన కొందరు సెప్టెంబరు 29న అపహరించారు. తమకు రూ.5 కోట్లు ఇస్తేనే విడిచిపెడతామని వారివారి కుటుంబ సభ్యులను బెదిరించారు. కర్ణాటక పోలీసులతో కలిసి పుణె పోలీసులు రంగంలోకి దిగి వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, బాధితులను రక్షించారు. రాము అప్పారే బలున్ (29), దత్త శివాజీ కోరే (20), హర్షద్ సురేశ్ పాటిల్ (22) అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. వారు పరారీలో ఉండగా, బంధించేందుకు శోధిస్తున్నారు.

కారాగారం నుంచి బెదిరింపులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: పరప్పన అగ్రహార కారాగారం నుంచి తమకు బెదిరింపులు వస్తున్నాయని కొందరు బాధితులు వివిధ ఠాణాల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రౌడీషీటర్ జోసెఫ్ అలియాస్ బబ్లి 2021లో హత్యకు గురయ్యాడు. ఆ హత్యలో తాము సాక్ష్యం చెప్పవద్దని కారాగారంలో ఉన్న సోమశేఖర్ నుంచి ఫోన్లు వస్తున్నాయని బాధితులు పేర్కొన్నారు. కారాగారంలోకి మళ్లీ ఫోను ఎలా వెళ్లిందనే అంశాన్ని గుర్తించేందుకు సిబ్బంది సోదాలు చేపట్టారు.

వ్యాపారి ఇంట్లో దొంగతనం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఆలయాల్లో పూజలు చేసుకుంటాను ఆలయానికి వెళ్లిన లాలారాం అనే వ్యాపారి ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. రాత్రి పొద్దుపోయాక తిరిగి వచ్చేసరికి ఇంట్లో 355 గ్రాముల ఆభరణాలు, ఐదు కిలోల వెండి వస్తువులు, రూ.70 వేల నగదు దొంగతనమయ్యాయని నెలమంగల ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఆనేకల్‌లో ఏనుగుల భయం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఆనేకల్ శివార్లలోని నీలగిరి తోపులోకి పదికిపైగా ఏనుగులు వచ్చాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పణకనహళ్లి సమీపంలోని కానాయనకహళ్లిలో ఉన్న ఏనుగులను చూసి స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకుని వచ్చిన అటవీశాఖ సిబ్బంది ఆ ఏనుగులను అడవిలోకి మళ్లించే ప్రయత్నాలను ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నానికి ఏనుగులను అడవిలోకి మళ్లించామని అధికారులు తెలిపారు.

జోషిపై సిద్దు గరం

ధార్వాడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ తీవ్రవాదులకు మద్దతు ఇస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఇతర భాజపా నాయకులు చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఖండించారు. ధార్వాడలో ఆయన ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో భాజపా నాయకుల అతితెలివిని మెచ్చుకోవాలి. ప్రహ్లాద్ జోషి అందరికన్నా పెద్ద ఉగ్రవాది అని వ్యాఖ్యానించారు.

✦ పాత హుబ్బళ్లి పోలీసు ఠాణాపై 2022లో దాడికి పాల్పడిన నిందితులపై కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నట్లు ఆరోపిస్తూ భాజపా నాయకులు ధర్నాకు దిగారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, భాజపా ఎమ్మెల్యే మహేశ్ టెంగినకాయి నేతృత్వంలో నిర్వహించిన ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. రాస్తారోకో చేసిన ఆందోళనకారులను వెనక్కు వెళ్లాలని నగర పోలీసు కమిషనర్ శశికుమార్ చేసిన హెచ్చరికలను ఆందోళనకారులు పట్టించుకోలేదు. వారిని అరెస్టు చేసి, స్థానిక ఠాణాకు తీసుకువెళ్లి, అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

సతీశ్ అభిమానుల జోరు

బెళగావి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సిద్దరామయ్య బెళగావి పర్యటన సందర్భంలోనే 'కాబోయే ముఖ్యమంత్రి సతీశ్ జార్కిహొళికి అభినందనలు' అంటూ పోస్టర్లు వెలిశాయి. సతీశ్ అభిమానులు, కర్ణాటక రక్షణ వేదికె నారాయణగౌడ వర్గానికి చెందిన నాయకులు నగర వీధుల్లో ఈ పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. స్థానిక నేతలు తనపై అభిమానంతో ఆ పోస్టర్లు ఏర్పాటు చేశారని సతీశ్ పేర్కొన్నారు.

ముగ్గురికి వెసులుబాటు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: ఒక మహిళతో పలుమార్లు నాయకులను హనీట్రాప్‌లో ఇరికించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్న ప్రధాన అనుచరులు ముగ్గురికి చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం ముందస్తు బెయిలు మంజూరు చేసింది. లోహిత్, కిరణ్, ఆకాశ్ నాయుడుకు బెయిలు లభించింది. వారి అర్జీపై విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోష్ గజానన భట్ షరతులతో కూడిన బెయిలు ఇచ్చారు.

భక్తురాలి గొలుసు చోరీ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: విద్యాశంకర ఆలయంలో కీర్తనలు పఠిస్తున్న కూర్చుని భజన చేస్తున్న సమయంలో ఒక మహిళ మెడలోని గొలుసును ఓ ఆగంతకుడు తెంపుకెళ్లాడు. గొలుసు చేతితో పట్టుకోవడంతో 20 శాతం ముక్కతో నిందితుడు పరారయ్యాడు. ఈ ఘటన ఆలయం ఆవరణలోని సీసీ కెమెరాలో నమోదైంది. బాధితురాలి ఫిర్యాదుతో నందిని లేఔట్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రౌడీల కోసం గాలింపు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: కోర్టు వివాదంలో ఉన్న భూమికి సంబంధించి రూప అనే గృహిణిపై గత గురువారం దాడి చేసి పరారైన రౌడీషీటర్ల కోసం కాడుగోడి ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. సుహేయిల్ బేగ్, మసూద్ బేగ్, అస్లామ్ బేగ్, రాఘవేంద్రలు తమ అనుచరులతో వచ్చి బుల్‌డోజర్‌తో రూపకు చెందిన ప్రహరీ గోడను కూల్చారు. ఆమెపై దౌర్జన్యానికి పాల్పడి వెళ్లారు.

సంకుచిత భావనతోనే ముప్పు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: సంకుచిత మనోభావన విడిచిపెట్టి, విశాల సూత్రాల వైపు ప్రయాణం చేయడమే విజయదశమి ఆచరణ ఉద్దేశమని సద్గురు మధుసూదన సాయి పేర్కొన్నారు. ముద్దేనహళ్లి సత్యసాయి గ్రామంలో దసరా మహోత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ శాంతితోనే లోక కల్యాణం సాధ్యమన్నారు. సత్యసాయి కళాశాల వైస్ ఛాన్స్‌లర్ నరసింహమూర్తి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ తదితరులు చివరి రోజు వేడుకల్లో పాల్గొన్నారు.



యజ్ఞ గుండంలో హవిస్సు వేస్తున్న సీపీ రాధాకృష్ణన్

గ్యారంటీలు రాష్ట్ర ప్రగతికి దిక్సూచీ

ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటన

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీలతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోంది. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో సండూరు పట్టణంలోని విశ్వాస్ యు.లాడ్ మైదానంలో ఏర్పాటు చేసిన తాలూకా సాధన సమావేశం, అభివృద్ధి పనులకు భూమిపూజ, అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. సండూరు ప్రాంతంలో రూ.280 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. 2004 నుంచి 2024 వరకు రూ.1216 కోట్లు నిధులు విడుదల చేశాం. నిడుగుర్తిలో 58 గ్రామాలకు రూ.160 కోట్లతో బహుళ గ్రామాల తాగునీటి పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. 2013లో రాష్ట్రంలో సుమారు 15 లక్షల పక్కా గృహాలు నిర్మించాలని లక్ష్యంగా సండూరు తాలూకాలోనే 12 వేల పక్కా గృహాలు నిర్మించారని గుర్తుచేశారు. సండూరు తాలూకా సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.1216 కోట్లు కేటాయించింది. ప్రజలు శ్రేయస్సు కోసం ప్రభుత్వం శ్రమిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమలు చేసింది తమ ప్రభుత్వమేనని, వారి అభివృద్ధికి రూ.33,182 కోట్లు కేటాయించినట్లు వివరించారు. పన్నుల వాటా నిధుల కేటాయింపులో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. పన్నుల వసూళ్లలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. మనకు రావాల్సిన వాటా దక్కడం లేదని విచారం వ్యక్తం చేశారు. సండూరు తాలూకా అభివృద్ధికి మంత్రి సంతోష్ ఎస్.లాడ్, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ ప్రధాన కారణమన్నారు. తాలూకాను అభివృద్ధి చేసిన ఘనత వారికే దక్కుతుంది. అభివృద్ధి అంటే తుకారామ్..తుకారామ్ అంటే అభివృద్ధి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మాట్లాడుతూ కల్యాణ కర్ణాటకలో సండూరు ఓ ప్రాంతం, ఈ ప్రాంతంలో విద్యాలయాలు, వైద్య, ఇంజినీరింగ్ సీట్లు విద్యార్థులకు లభిస్తున్నాయని తెలిపారు. నా విధాన సభ నియోజకవర్గం కనకపుర కంటే సండూరు తాలూకా అభివృద్ధికి రూ.1216 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ మాట్లాడుతూ తాలూకా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాముఖ్యత ఇచ్చిందన్నారు. లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్ మాట్లాడుతూ సండూరు తాలూకా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. సండూరు పట్టణానికి అమృత 2.0 పథకం కింద నారిహళ్ల నుంచి ఉద్దేశిత పథకానికి రూ.54.45 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రూ.2.50 కోట్లతో తాలూకా కేంద్రంలో కనక భవనం నిర్మిస్తున్నట్లు వివరించారు. వెనుకబడిన వర్గాల సంక్షేమశాఖ నుంచి వీరశైవ లింగాయత, విశ్వకర్మ, కురుబ, మేదర, యాదవ, మడివాళ, తదితర 13 సంఘాలకు రూ.7.50 కోట్లతో సముదాయ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, మంత్రి సంతోష్ జార్కిహొళి, ఎమ్మెల్యేలు గణేశ్, నారా భరత్‌రెడ్డి, బి.ఎం.నాగరాజు, డా.శ్రీనివాస్, లతా మల్లికార్జున, కె.ఎం.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్, మండలి అధ్యక్షుడు ముండరగి నాగరాజ, జిల్లా బాధ్య కార్యదర్శి డాక్టర్ త్రిలోకచంద్ర, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఐజీపీ లోకేష్‌కుమార్, ఎస్పీ శోభారాణి, జడ్పీ సీఈవో రాహుల్, ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఏసీ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సండూరు ప్రజలతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాటామంతీ

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్- కిలో.. రూ.లలో)



బీన్స్	115
క్యారెట్	65
బీరకాయలు	35
క్యాబేజీ	20
కాలీఫ్లవర్(ఒక్కటి)	25
సొరకాయ	35
దొండకాయలు	30
పొట్లకాయ	35
టమాటా(నాటు)	85
గుమ్మడి	45
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డలు(మేలురకం)	85
ఉల్లిగడ్డలు(మామూలు)	50
వెల్లుల్లి	420
సాంబారు ఉల్లి	120
బీట్‌రూట్	25
వంకాయలు	30
బెండకాయలు	28
ముల్లంగి	40
నిమ్మకాయలు	270
వాషింగ్టన్ ఆపిల్	325
సిమ్లా ఆపిల్	145
గ్రీన్ ఆపిల్	335
అరటి కాయలు	54
సపోటా	45
పైనాపిల్	40
బొప్పాయి	44
ఆరెంజ్	70
బత్తాయి	65

దుబాయ్ యజమానికి రూ.2.50 కోట్ల టోకరా

ఉడుపి, న్యూస్‌టుడే: ప్రవాస భారతీయుడు ప్రవీణ్ కుమార్ శెట్టికి దుబాయ్‌లో ఉన్న హోటల్‌లో అకౌంటెంట్‌గా చేరి రూ.2.50 కోట్ల వంచనకు పాల్పడిన బార్కూరుకు చెందిన నాగేశ్ పూజారి (31) అనే వ్యక్తిని ఉడుపి సైబర్ క్రైమ్ ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి పరారై వచ్చిన నిందితుడు మైసూరు జిల్లా నంజనగూడులో తలదాచుకున్నాడు. పన్ను చెల్లింపుల పేరిట హోటల్‌కు చెందిన నగదును తన ఖాతాకు బదిలీ చేసుకుని, నాగేశ్ పూజారి ఉడుపికి పరారై వచ్చేశాడు. ప్రవీణ్‌కుమార్ శెట్టి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు.

ఒకే వేదికపై గాలి సోదరుల ప్రత్యక్షం

బళ్లారి, న్యూస్‌టుడే: విధానసభ ఎన్నికల్లో పరస్పరం పోటీ చేసి..కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కారణమైన రెడ్డి బ్రదర్స్ ఒకే వేదికపై మొదటి సారి ప్రత్యక్షమయ్యారు. సంగనకల్లు రహదారిలోని వాజపేయి లేఅవుట్‌లోని భాజపా రెడ్డి కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి లక్ష్మి అరుణ పాల్గొనడం విశేషం. సోమశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి మధ్యలో ఎమ్మెల్సీ ఏచరెడ్డి సతీశ్ కూర్చున్నారు. పరస్పరం ఇద్దరు మాట్లాడుకోవడంతో కార్యకర్తలలో నూతన ఉత్సాహం కనిపించింది. మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో పరస్పరం పోటీ చేసినా మేము సోదరులుగా ఎప్పటికీ ఒక్కటే..ఏదో కారణంతో మా మధ్య బేధాభిప్రాయాలు తీసుకుని రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో జిల్లాలో భాజపాకు పూర్వ వైభవం తీసుకునిరావడం తమ ముందున్న లక్ష్యమన్నారు. సోదరుడు గాలి సోమశేఖర్‌రెడ్డి తన సోదరుడి మాటలతో ఏకీభవించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి బి.శ్రీరాములు దూరంగా ఉండిపోయారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, పార్టీ నేతలు డా.వెంకట మహిపాల్, గురులింగనగౌడ, గోనాళ్ రాజశేఖర్‌గౌడ, హెచ్.హనుమంతప్ప, ఓబళేశ, మాజీ మేయర్ గుర్రం వెంకటరమణ, బుడా మాజీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్, మాజీ మంత్రి ప్రసాద్ పాల్గొన్నారు. పాలికె 19వ వార్డు సత్యనారాయణపేట ప్రధాన రహదారిలో స్థానిక కార్పొరేటర్ కె.ఎస్.అశోక్, కె.ఎస్.దివాకర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి, గాలి లక్ష్మిఅరుణ, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా హాజరయ్యారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను నిర్వహించారు.



సత్యనారాయణపేటలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న గాలి సోమశేఖర్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి తదితరులు

వైద్య సేవలతోనే గొప్ప పేరు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: వైద్యులుగా మారాలన్న ఆకాంక్షను నెరవేర్చుకుని, సమాజానికి ఉత్తమ సేవలు అందించాలని వైద్య విద్యార్థులకు మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్ సిటీ పీఈఎస్ వైద్య కళాశాల మొదటి ఏడాది, మొదటి బ్యాచ్ విద్యార్థులకు తరగతులను ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతతో కూడిన బోధన అందించే సంస్థలో చేరడం ద్వారా విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాలు లభిస్తాయని తెలిపారు. వైద్యులుగా మారిన అనంతరం మానవత్వం, బాధ్యత, కరుణ, నిజాయతీ, అంకితభావంతో సేవలు అందించాలని సూచనలు చేశారు. డాక్టర్ బీసీరాయ్ ఆదర్శాలను ఒంటబట్టించుకుని వైద్య కళాశాలను తాము బెంగళూరులో ప్రారంభించామని పీఈఎస్ వర్సిటీ ఛాన్స్‌లర్ ఆచార్య ఎంఆర్ దొరెస్వామి తెలిపారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ ఆరోగ్య, వైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అచల్ గులాటి, పీఈఎస్ ఆచార్యులు జవహర్, డాక్టర్ జె సూర్య ప్రసాద్, ఆచార్య అజోయ్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వేదికపై ఆచార్య దొరెస్వామి, డాక్టర్ శరణు ప్రకాశ్ పాటిల్, ఇతర ఆచార్యులు

చేపలవేటపై నిషేధం

కార్వార, న్యూస్‌టుడే: భట్కళ తాలూకా అరేబియా సముద్రంలో ఉన్న నేత్రాణి ద్వీపంలో నౌకాదళం సమరాభ్యాసాన్ని చేయనుంది. వాయుసేన సహకారంతో మూడు రోజుల పాటు విమానం, నౌకల్లో వెళుతూ సముద్రంలోని తుపాకులతో కాల్పులు చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి వరకు నేత్రాణి ద్వీపానికి పది నాటికల్ మైళ్ల దూరం వరకు చేపలవేట, పర్యాటకుల బోట్ల రాకపోకలపై అధికారులు నిషేధాన్ని విధించారు. సోమవారం ఉదయం నుంచే నౌకాదళం అభ్యాస ప్రక్రియను ప్రారంభించింది.

రుణం చెల్లించలేక పరారీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అలవాటుపడిన భరత్ (32) అనే బ్యాంకు ఉద్యోగి రూ.20 లక్షలు నష్టపోయాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఇల్లు వదిలి పారిపోయాడు. తాను చేసిన అప్పులకు ప్రతి నెలా కంతులు కట్టలేకపోతున్నానని, ఎవరెవరికి ఎంతెంత నగదు ఇవ్వాలో పేర్కొంటూ లేఖ రాసిపెట్టి ఇంటి నుంచి వెళ్లిపోయాడు.


ప్రమాదంలో కుమార్తె మృతి

మైసూరు, న్యూస్‌టుడే: హుణసూరు సమీపంలోని ఎరడనే పక్షి రాజపుర గ్రామం వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆరోవి (7) అనే బాలిక మరణించింది. ఆమె తండ్రి ఫిలిప్ చిన్నపాటి గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న ఆరోవిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళుతున్న సమయంలో మైసూరు వైపు నుంచి వచ్చిన బైకు ఢీకొనడంతో తండ్రీ కుమార్తె ఇద్దరూ గాయపడ్డారు. తలకు గాయాలైన బాధితురాలిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించింది.

బావిలో మునిగి బాలుడి మృతి

కలబురగి, న్యూస్‌టుడే: ఇఫ్రెహాద కూడలి వద్ద నేల బావిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ముగ్గురు బాలల్లో మహ్మద్ హమ్జా (11) నీట మునిగి మరణించాడు. ఆదివారం సాయంత్రం బావి గట్టున కూర్చుని గాలంతో చేపలు పడుతున్న సమయంలో మహ్మద్ హమ్జా అదుపుతప్పి నీట మునిగి మరణించాడు.

మేలుకోటెలో పుస్తకావిష్కరణ



'కవియ కన్నడి' పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న సాహితీవేత్త బాలకృష్ణ, తదితరులు

మండ్య, న్యూస్‌టుడే: పురోహిత తిరునారాయణ అయ్యంగార్ నరసింహాచార్ (పుతిన) వర్ధంతిలో భాగంగా మేలుకోటెలోని పుతిన కళామందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవియ కన్నడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకంలోని కొన్ని భాగాలను, వాక్యాలను సాహితీవేత్త, పుతిన ట్రస్టు అధ్యక్షుడు విద్వాన్ డి.బాలకృష్ణ పఠన చదివి వినిపించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మేలుకోటె పరిసరాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, ధార్మిక కార్యక్రమాలు, ఉత్సవాలు అన్నీ పుతిన జీవనశైలిలో, రచనల్లో అంతర్గతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ట్రస్టు ప్రతినిధులు డాక్టర్ ఆనందరామ ఉపాధ్య, డాక్టర్ హెచ్‌వీ రవీశ్, డాక్టర్ బీవీ జయరాం, కేఎస్ రవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టూరిస్ట్ వాహనం బోల్తా


చిక్కమగళూరు, న్యూస్‌టుడే: మూడిగెరె తాలూకా సంపిగెఖాన్ వద్ద సోమవారం సంభవించిన రోడ్డుప్రమాదంలో తొమ్మిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారిని చికిత్సకు కళస, మూడిగెరె ఆసుపత్రుల్లో చేర్పించారు. బెంగళూరు నుంచి హొరనాడు అన్నపూర్ణేశ్వరి ఆలయానికి వెళ్లిన 15 మంది ప్రయాణికులు, వెనక్కు తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం సంభవించింది. వేగంగా వస్తూ టీటీ వాహనం ఓ మలుపులో బోల్తా కొట్టింది. బాళూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఠాణాలో సీమంతం

మైసూరు, న్యూస్‌టుడే: బైలకుప్ప ఠాణాలో కానిస్టేబుల్‌గా సేవలు అందిస్తున్న సునీతకు సహోద్యోగులు సోమవారం సీమంతం చేశారు. ఠాణాలో ఆమెకు సీమంతం చేసి, బహుమతులు అందించి, వీడ్కోలు పలికారు. ఆమెకు చీర, బియ్యం, తాంబూలం తదితరాలను ఇచ్చి శాస్త్ర బద్ధంగా సీమంతాన్ని నిర్వహించారు.

ఘనంగా చెలువరాయ వేడుకలు

మండ్య, న్యూస్‌టుడే: మేలుకోటెలో శరన్నవరాత్రుల్లో భాగంగా జన్నిపుర దసం వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. దశ దిక్కులకు బాణాలను ప్రయోగించి, భక్తులకు అర్చకులు ఆశీస్సులు అందించారు. శని, ఆదివారాల్లో అశ్వవాహనంపై తిరునారాయణస్వామి, శేషవాహనంపై కల్యాణనాయకి అమ్మవారు ఆలయం నాలుగు వీధుల్లో ఊరేగారు. జనరేటర్, విద్యుత్తు దీపాల వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొందరు భక్తులు తీసుకువచ్చిన కర్ర దీపాల వెలుగులో కొంత సమయం ఊరేగింపు కొనసాగింది. శమీ పూజ సమయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. మేలుకోటెలో దసరా వేడుకలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతూ పంపిన దస్త్రం బుట్టదాఖలు అయిందని కొందరు అర్చకులు ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు.



శేషవాహనోత్సవంలో కల్యాణనాయకి అమ్మవారు

బెంగళూరు

• బెంగళూరు • హోసూరు

భూములు వెనక్కిస్తే తప్పు ఒప్పవుతుందా?

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: చట్ట వ్యతిరేకంగా పొందిన భూమిని తిరిగి వెనక్కి ఇచ్చినంత మాత్రానా చట్టం నుంచి తప్పించుకోలేరని బెంగళూరు నగర దక్షిణ జిల్లా భాజపా మాజీ అధ్యక్షుడు ఎన్‌ఆర్ రమేష్ అన్నారు. ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న సిద్ధార్థ విహార్ ట్రస్టు పేరుతో విద్యా సంస్థల ఏర్పాటు చేయాలనే నెపంతో నిబంధనలకు వ్యతిరేకంగా ఐదెకరాల భూమి పొందారన్నారు. దీనిపై విమర్శలు రావడంతో ఆ భూమి తిరిగి ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. భూమి కేటాయింపునకు వ్యతిరేకంగా తాను ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

హత్య కేసు నిందితులకు గ్రామస్థుల స్వాగతం

విజయపుర, న్యూస్‌టుడే: సీనియర్ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య కేసులో జైలుపాలై జైలు నుంచి విడుదలైన నిందితులు పశురామ వాగ్మోరే, మనోహర్ యడవెలు ఆదివారం తమ గ్రామానికి చేరుకున్నారు. విజయపురలోనే శ్రీరామసేన, హిందూ సంఘాల ప్రతినిధులతో పాటు గ్రామంలోని కొందరు నిందితులకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ నెల 9న జామీను పొందిన నిందితులు 10వ తేదీ కారాగారం నుంచి విడుదలయ్యారు. బెంగళూరులోనే రెండు రోజులుండి ఆదివారం విజయపురకు చేరుకున్నారు. గౌరీ లంకేశ్ హత్య కేసులో నిందితులు ఆరేళ్లుగా పరప్పన అగ్రహార కారాగారంలో ఉంటున్న విషయం తెలిసిందే.

హో సూ రు క బు ర్లు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు సమీపంలోని ఒబ్బనూరులో 23 ఏళ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహించి, విద్యా రంగంలో ఉత్తమ సేవలందించిన తెలుగు మాతృభాష కలిగిన బెళ్లూరు నాగరాజుకు ఐటీఏల ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ ప్రశస్తి అందజేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హోసూరు, డెంకణికోట న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.రామప్రకాష్ బృందం డెంకణికోటలోని తన కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

హోసూరు-కృష్ణగిరి మార్గంలో ట్రాఫిక్ తిప్పలు

హోసూరు, న్యూస్‌టుడే: విజయదశమి పండగ అనంతరం పెద్ద సంఖ్యలో ఉద్యోగులు కర్ణాటక నుంచి తమిళనాడు, తమిళనాడు నుంచి కర్ణాటకకు సోమవారం వివిధ వాహనాల్లో హోసూరు-కృష్ణగిరి మార్గంలో బయలుదేరారు. ఈ నేపథ్యంలో హోసూరు- కృష్ణగిరి జాతీయ మార్గంలో గోపసంద్రం నుంచి మేలుమలై వరకు లారీలు, కారులు, టెంపోలు వరుసగా ఢీకొనడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరోవైపు అక్కడక్కడా జాతీయ రహదారి వెడల్పు పనులు జరుగుతుండడంతో 20 కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ రద్దీ నెలకొని వాహనచోదకులు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు హోసూరు, శూలగిరి, కురుబరపల్లి పోలీసులు నానా అవస్థలుపడ్డారు.

విద్యార్థులకు సైకిళ్ల వితరణ

హోసూరు, న్యూస్‌టుడే: హోసూరు-ఉద్దనపల్లి జాతీయ మార్గంలోని రాయకోటలో నిర్వహిస్తున్న ప్రభుత్వ హైయ్యర్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులకు కృష్ణగిరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చక్రపాణి సోమవారం సైకిళ్లు అందజేశారు. కార్యక్రమానికి కలెక్టరు సరయు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి చక్రపాణి మాట్లాడుతు విద్యార్థులు చక్కగా చదువుకోవడానికి ప్రభుత్వం ఉచిత పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకొని బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీ గోపినాథ్, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్, వేపనహళ్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్, జిల్లా విద్యాధికారి మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా పనులు

హోసూరు, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రామీణాభివృద్ధి పథకం కింద చేపట్టిన వివిధ పనులపై సోమవారం కలెక్టర్ కార్యాలయ సభాంగణంలో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా అదనపు కలెక్టరు, జిల్లా ప్రాజెక్టు అధికారి వందన కర్గ్, గ్రామీణాభివృద్ధి ఇంజినీరు మలర్‌విజి తదితరులు హాజరయ్యారు. సమావేశాన్ని ప్రారంభించిన కలెక్టర్ సరయు మాట్లాడుతూ పీఎం ఆవాజ్ యోజన కింద నిర్మిస్తున్న ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరుళ గిరిజనులకు అదనంగా ఇళ్ల నిర్మాణంపై చర్చించారు. జల్‌జీవన్ పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని సూచించారు.

శూలగిరి తహసీల్దారుగా మోహన్‌దాస్



శూలగిరి తహసీల్దారుగా మోహన్‌దాస్ బాధ్యతలు చేపట్టారు. ఆయనను శూలగిరి పట్టణ పంచాయతీ ఉపాధ్యక్షుడు సురేశ్, జిల్లా వ్యవసాయ సంఘం ప్రముఖుడు నారాయణస్వామి, ముస్లిం పెద్ద ముస్తఫా తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తాలూకాలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ, ఇతర సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. **-న్యూస్‌టుడే, శూలగిరి (బేరికె)**

తమ్ముళ్లను బెదిరించిన వ్యక్తి హత్య



నిందితుడు టింకుమలార్

బుక్కసాగరం (బేరికె), న్యూస్‌టుడే: తన తమ్ముళ్లను చంపుతానని బెదిరించిన వ్యక్తిని అన్న హత్య చేసిన ఘటన బేరికే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సోం రాష్ట్రం నేపల్‌పార గ్రామానికి చెందిన టింకుమలార్, అతని తమ్ముళ్లు చోటిలాల్, విష్ణు బుక్కసాగరంలోని ఓ ప్రైవేటు క్రషర్‌లో పనిచేస్తున్నారు. అదే రాష్ట్రానికి చెందిన అశోక్‌తిమారి (31) అనే వ్యక్తి అక్కడే పనిచేస్తున్నారు. రెండు నెలల క్రితం అశోక్‌తిమారితో చోటిలాల్, విష్ణుకు గొడవ జరిగింది. ఆ సందర్భంగా అశోక్ వారిద్దరినీ చంపుతానని బెదిరించాడు. ఈ విషయాన్ని వారిద్దరూ తమ అన్న టింకుమలార్‌కు చెప్పారు. అది మనసులో పెట్టుకున్న టింకుమలార్ 12వ తేదీ రాత్రి అశోక్‌తిమారిని కలిసి మద్యం తాగుదామని ఆహ్వానించాడు. అశోక్‌తిమారితో అధిక మద్యం తాగించిన టింకు 'నా తమ్ముళ్లను చంపుతానని హెచ్చరిస్తావా' అంటూ అతడి తలపై బండరాయితో కొట్టి హత్య చేశాడు. సోమవారం అశోక్‌తివారి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు బేరికే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో టింకుమలార్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మానసిక రోగిపై హత్యాచారం: దుండగుడి అరెస్టు

చింతామణి, (న్యూస్‌టుడే): మానసిక రోగిని చంపి మృతదేహంపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ముళబాగిలు పోలీసులు చింతామణి తాలూకా మురగమల్లలో సోమవారం అరెస్టు చేశారు. కోలారు జిల్లా ఎస్పీ నిఖిల్ తెలిపిన వివరాల ప్రకారం.. ముళబాగిలు పట్టణంలో నివసిస్తున్న మైక్ శంకర్ భార్య సుశీలమ్మ(55) మానసిక రోగంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 24న సాయంత్రం 6 గంటలకు ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెదకడం మొదలుపెట్టారు. ఈక్రమంలో మరుసటి రోజు ఉదయం పట్టణ సమీపంలో రహదారి పక్కన ఆమె మృతదేహం లభించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తొలుత మృతురాలి భర్త శంకర్‌ను అనుమానించారు. అనంతరం పట్టణంలోని ఏపీఎంసీ యార్డు పరిధిలోని దాదాపు వంద సీసీ కెమెరాలు పరిశీలించారు. ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి 12 గంటలకు పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ సుహేల్ సుశీలమ్మను ఇంటి వద్ద దిగబెడతానంటూ ఆటోలో ఎక్కించుకున్నాడు. ఆపై దారి మళ్లించి తీసుకెళుతుండగా సుశీలమ్మ ఆటో నుంచి బయటకు దూకింది. వెంటనే నిందితుడు ఆటోను ఆపి ఆమె తలపై రాయితో కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని ఆటోలో వేసుకొని అత్యాచారం చేశాడు. అనంతరం అదే ఆటోలో కొంచం ముందుకెళ్లి శవాన్ని రోడ్డుపై పడేసి పారిపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళ అదృశ్యం

పావగడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆదర్శనగర్‌లో నివాసముంటున్న నాగమ్మ (44) అనే మహిళ ఐదు రోజులుగా కనిపించడం లేదంటూ ఆమె సోదరుడు మద్దిలేటప్ప సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదర్శనగర్‌కు చెందిన నాగమ్మ 10వ తేదీ ఉదయం పనికి అంటూ ఇంటి నుంచి వెళ్లారు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు వెదికారు. ఫలితం లేకపోవడంతో ఆమె సోదరుడు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. నాగమ్మకు వివాహం కాకపోవడంతో తన సోదరుడి వద్దే ఉంటున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



చిరు వ్యాపారులు వదిలేసిన అరటి పిలకలు తదితరాలు



పాదచారి మార్గంపై ఇలా...



ఆకుకూరలు, వ్యర్థాల గుట్ట

పండగెళ్లింది.. చెత్త మిగిలింది



చిక్కపేట రహదారిలో చెత్తకుప్పను తొలగిస్తున్న కార్మికులు

బెంగళూరు (యశ్వంతపుర), (శివాజీనగర), న్యూస్‌టుడే : ఆయుధపూజ, విజయదశమి పండగలతో నగరం చెత్తకుప్పల మయమైంది. పండగల సందర్భంగా ఎక్కువగా చెత్త పోగవుతున్నట్లు పాలికె అధికారులు వాపోతున్నారు. దాన్ని తొలగించేందుకు కార్మికులు 24 గంటలూ వారం పాటు శ్రమించాల్సి వస్తోంది. మార్కెట్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో చెత్తకుప్పలు ఎక్కువ పేరుకుపోతున్నాయి. బూడిద గుమ్మడి కాయ, అరటి ఆకులు, పూలు విక్రయించిన తర్వాత మిగిలిన వాటిని రైతులు, చిరు వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ వదిలేశారు. పచ్చి చెత్తను తమ వెంట తీసుకెళ్లి పొలాల్లో వేసుకోవాలని అధికారులు చేసిన విజ్ఞప్తులను కర్షకులు పెడచెవిన పెట్టారు. సాధారణ రోజుల్లోనే నిత్యం నాలుగు వేల టన్నుల చెత్త పోగవుతుండగా పండగ రోజుల్లో అది 20 నుంచి 30 శాతం అధికంగా ఉంటుందని పాలికె అధికారులు చెబుతున్నారు. దసరా సందర్భంగా ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలు, వ్యాపార సంస్థలు తదితర వాటి ముందు గుమ్మడికాయలను కొడతారు. మిగతా పండగల కన్నా దసరా పండగ రోజులు ఎక్కువగా చెత్త పోగవుతున్నట్లు గుర్తించారు. చెత్తకారణంగా వాహనదారులు, పాదచారులు సంచరించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కె.ఆర్.మార్కెట్ చుట్టుపక్కల రహదారులు, ఉపరితల వంతెన స్తంభాలు, విక్టోరియా ఆసుపత్రి ప్రహరి, మడివాళ మార్కెట్, యశ్వంతపుర, గాంధీ బజార్, మల్లేశ్వరం, గంగానగర, కేఆర్‌పురం తదితర మార్కెట్ల చుట్టుపక్కల టన్నుల కొద్దీ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ ఎండిన చెత్తకు కొందరు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు సెలవులో ఉండటంతో చెత్త తొలగించేవారు లేరు. కొందరు టిప్పర్లలో చెత్త నింపుకుని పాయింట్ వద్దకు వస్తే.. అక్కడ గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆది, సోమవారాల్లో భారీ వర్షం కురవడంతో ఇప్పటికే పగిలిన బూడిద గుమ్మడి కాయలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయి. స్థానికుల ఫిర్యాదులతో సిబ్బంది కొన్నిచోట్ల బుల్‌డోజర్లు తెప్పించి వ్యర్థాలను గుట్టగా చేర్చారు. సోమవారం మధ్యాహ్నం నుంచి వ్యర్థాలను తొలగించే ప్రక్రియను పాలికె ప్రారంభించింది. మూడు రోజుల్లో మొత్తం తొలగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారానికి ఆదేశం



సమావేశంలో పాల్గొన్న జిల్లాధికారి శుభాకల్యాణ్

తుమకూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని రెవెన్యూ శాఖ పరిధిలో రైతుల పట్టాలు, ఆధార్ సీడింగ్, పెన్షన్లు తదితరాలకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను జాప్యం చేయకుండా పరిష్కరించాలని జిల్లాధికారి శుభాకల్యాణ్ అధికారులకు నిర్దేశించారు. ఆమె సోమవారం జిల్లాధికారి కార్యాలయంలోని కెస్వాన్ సభాంగణం నుంచి తాలూకా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఆధార్ సీడింగ్‌లో సుమారు 85.9 శాతం లక్ష్యం సాధించామని గుర్తుచేశారు. వచ్చే వారం నుంచి ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పెన్షన్ అదాలత్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే సూచనలున్న నేపథ్యంలో ఆరెంజ్, ఎల్లో అలర్ట్ ప్రకటించాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు జిల్లాధికారి తిప్పేస్వామి, అసిస్టెంట్ కమిషనర్ గౌరవ్‌కుమార్‌శెట్టి, తహసీల్దార్లు రేష్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రాస్‌కంట్రీ పోటీల్లో ఆళ్వాస్ సత్తా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: విద్యా శాఖ, దక్షిణ కన్నడ జిల్లా, నూజిబాళ్తి పీయూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పీయూ కళాశాలల క్రాస్‌కంట్రీ పోటీల్లో ఆళ్వాస్ విద్యా సంస్థ బాలబాలికల విభాగాల్లో సత్తాచాటి డబుల్స్ ఛాంపియన్స్‌గా నిలిచింది. సోమవారం విజేత క్రీడాకారులను ఆళ్వాస్ సంస్థ అధ్యక్షుడు డా.ఎం.మోహన్‌ఆళ్వా అభినందించారు. బాలుర విభాగంలో రంగణనాయ్కర్ తొలి, రఘువీర్ ద్వితీయ, దర్శన్ మూడో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో తొలి మూడు స్థానాలను చరిష్మ, గానవి, దీప్తి సాధించారు.

మల్లయుద్ధ పోటీల్లో విజేతలు



విజేత లక్ష్మీ

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: చిత్రదుర్గంలో నిర్వహించిన మల్లయుద్ధ పోటీల్లో పురుషుల విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన సురేశ్ రాథోడ్, మహిళల విభాగంలో బెళగావి లక్ష్మీ విజేతలుగా నిలిచారు. పురుషుల ఫైనల్స్‌లో సురేశ్ రాథోడ్ మహారాష్ట్రకు చెందిన పాలు అమాద్‌ను ఓడించి చిన్మూలాద్రి కేసరి బిరుదుతో పాటు రూ.30 వేలు నగదు బహుమతి పొందారు. మహిళల తుది పోరులో బెళగావి చెందిన లక్ష్మీ అదే ఊరుకు చెందిన రాణిని ఓడించి ఓనకే ఓబవ్వ కేసరి బిరుదుతో పాటు రూ.15 వేలు నగదు బహుమతి సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మల్లయోధులు తలపడ్డారు. పహిల్వాన్ తిప్పేస్వామి, మహేంద్రనాథ్, అఫీజ్, మూర్తణ్ణ, అమృత్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

నగరంలో ఈనాడు

- ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బన్నేరుఘట్ట రహదారి నిమ్హాన్స్ ఆవరణలో మానసిక ఆరోగ్య సంత కార్యక్రమం జరుగుతుంది. ప్రముఖ మానసిక వైద్యనిపుణులు పాల్గొంటారు.
- ఉదయం 10 గంటలకు జయనగర శాలిని మైదానంలో పుస్తక సంత ప్రదర్శన.
- ఉదయం 11 గంటలకు క్వీన్స్ రోడ్డులోని కాంగ్రెస్ భవన్‌లో మహిళా కాంగ్రెస్ పదాధికారుల సమావేశం నిర్వహిస్తారు. దీనికి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

–న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగర రహదారుల్లో ఏర్పడిన గుంతల పూడ్చివేత, ఆస్తి పన్ను వసూళ్లు, వీధి కుక్కల నియంత్రణ, వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, కల్పించాల్సిన కనీస మౌలిక వసతులపై చర్చించేందుకు పాలికె చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ సోమవారం ఇక్కడ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ముంపు ప్రాంతాలపై నిరంతరం నిఘా వేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం కురిసే సమయంలో రహదారులు పాడవుతాయని, వాటికి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని సూచించారు.



ఉన్నతాధికారులతో సమావేశమైన చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్

హిమాలయాలు, లడాఖ్‌ను కాపాడరూ..



హిమాలయాలు, లడాఖ్‌ను కాపాడాలంటూ నగరంలో స్థిరపడిన అక్కడి ప్రజలు స్వాతంత్ర్య ఉద్యానంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. హిమాలయాలతో పాటు తమ భూభాగాన్ని కాపాడాలని కోరుతూ 30 రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు నడిచిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంచుక్‌కు ఆందోళనకారులు మద్దతు ప్రకటించారు. కేంద్రం స్పందించి తమ వినతులను పరిగణనలోకి తీసుకోవాలని ఆందోళనకారులు విన్నవించారు. **–న్యూస్‌టుడే, బెంగళూరు (శివాజీనగర)**

తెలుగు తేజానికి సత్కారం



ధార్వాడ కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగువారు డాక్టర్ ప్రసాద్‌ను హుబ్బళ్లిలోని నవీన్ పార్క్ నివాసదారుల సంఘం పదాధికారులు సత్కరించారు. డాక్టర్ ప్రసాద్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు హుబ్బళ్లి నగరం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నారని సంఘం నాయకుడు డాక్టర్ విజయ్‌శంకరేశ్వర్ అభినందించారు.

–న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

రాహుల్ ఖర్గేను ఆదర్శంగా తీసుకోవాలి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: సిద్ధార్థ విహార్ ట్రస్టుకు కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించిన రాహుల్ ఖర్గేను భాజపా నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కేపీసీసీ కార్యాధ్యక్షుడు మంజునాథ్ భండారి హితవు పలికారు. ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. భాజపా అధికారంలో ఉండగా దేవనహళ్లి సమీప పారిశ్రామికవాడలో ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన చాణక్య విశ్వవిద్యాలయానికి రూ.50 కోట్లకు 116 ఎకరాలు కేటాయించారన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.137 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. విధాన పరిషత్తులోని ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి విద్యా సంస్థ ఏర్పాటుకు కర్ణాటక గృహ నిర్మాణ మండలి నుంచి పొందిన భూమిని బిరియాని హోటల్‌కు అద్దెకు ఇచ్చారని తెలియజేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆర్‌ఎస్‌ఎస్, చలవాది నారాయణ స్వామి తమకు కేటాయించిన భూములను ప్రభుత్వానికి వెనక్కి ఇచ్చి ఆదర్శంగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

ఉల్లాళు వార్డ్‌లో తాగునీటి పైపు పనులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: యశ్వంతపుర విధానసభా క్షేత్రం పరిధి ఉల్లాళు వార్డ్ ఏజీఎస్ లేఅవుట్‌లో కావేరి తాగునీటి పైపుల ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ సోమవారం భూమిపూజ చేసి మాట్లాడారు. ఇక్కడ నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా ఇంటింటికీ కావేరి నీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక లేఅవుట్ నివాసుల సంక్షేమాభివృద్ధి సంఘం సభ్యులు, వార్డ్ అధ్యక్షుడు, మహిళా కార్యకర్తలు, బెంగళూరు నీటి సరఫరా శాఖ అధికారులు ఉన్నారు.

ఆకట్టుకున్న తుమకూరు స్తబ్ద చిత్రం

విఖ్యాత మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జంబూ సవారిలో తుమకూరు జిల్లా కొరటగెరె తాలూకా సిద్ధరబెట్ట, దళిత రాజ కురంగరాయ, గల్లె బాని దేవాలయాలు, మధుగిరి కొండ, రాజా ఇమ్మడి చిక్కభూపాల, రాజా సంగప్పగౌడ తదితర అంశాలతో ప్రదర్శించిన స్తబ్ద చిత్రం ఆకట్టుకుంది. దీన్ని కళాకారులు తిపటూరు కృష్ణ, మల్లికార్జున్ మత్తిఘట్ట తదితరులు 15 రోజుల్లో రూపొందించారు. -న్యూస్‌టుడే, తుమకూరు



వాననీటిని ఒడిసి పట్టాల్సిందే..

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు వాన నీటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వాన నీటి సంరక్షణ నిపుణులు అన్నారు. సోమవారం ఇక్కడి జయనగరలోని సర్ ఎం.వి.విశ్వేశ్వరయ్య వాన నీటి సంరక్షణ కేంద్రాన్ని బి.పార్క్ బృందం సందర్శించింది. ఆ కేంద్రంలోని నిపుణులు బృందానికి నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. నగరంలో ఒకసారి వాన నీటిని పూర్తి స్థాయిలో ఆదా చేస్తే మూడేళ్ల పాటు తాగునీటికి ఎద్దడి ఉండదని నిపుణుడు డాక్టర్ సతీశ్ తెలిపారు. ఏటా నగరంలో 900 మి.మీ. వర్షపాతం నమోదవుతుందన్నారు. ఆకాశం నుంచి భూమి మీద పడే ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో తాగునీటి క్షామంపై పలు సంస్థలు హెచ్చరించినా పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.



వాననీటి సంరక్షణ చర్యలను తిలకిస్తున్న సందర్శకులు

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు

దర్శన్‌కు దక్కని బెయిలు

బెంగళూరు (సదాశివనగర) : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో బెయిలు కోసం నటి పవిత్రా గౌడ, నటుడు దర్శన్ వేసుకున్న బెయిలు అర్జీని 57వ సీసీహెచ్ న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇదే కేసులో ఏ8 రవిశంకర్, ఏ13 దీపక్‌లకు న్యాయమూర్తి జైశంకర్ బెయిలు మంజూరు చేశారు. బెయిలు కోసం ప్రదోష్, వినయ్, జగదీశ్‌లు వేసుకున్న అర్జీపై విచారణను బుధవారానికి వాయిదా వేశారు. మొత్తం 17 మంది నిందితుల్లో ఐదుగురికి ఇప్పటి వరకు బెయిలు లభించింది. దర్శన్ తరఫున సీనియరు న్యాయవాది సీవీ నాగేశ్, పవిత్రా గౌడ పక్షాన సెబాస్టియన్ వాదనలు వినిపించారు. ప్రత్యేక దర్యాప్తు దళం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రసన్న కుమార్ వాదనలు వినిపించారు. అభియోగపత్రంలో పోలీసులు కొన్ని తప్పులు చేశారని నాగేశ్ చేసిన వాదనను ప్రసన్నకుమార్ ఖండించారు. హత్య చేసినట్లు కీలక సాక్ష్యాలు ఉన్నాయని, దర్శన్, పవిత్రా గౌడకు బెయిలు ఇవ్వకూడదంటూ అభ్యంతరం తెలిపారు.

విభేదాలు మరిచి పండగ ఆచరణ

మాన్వి, న్యూస్‌టుడే: అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎప్పుడూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం పరిపాటి. ఈసారి జరిగిన శమీ పూజోత్సవంలో అందుకు విరుద్ధంగా జరిగింది. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్ ఇద్దరూ శమీ పూజలో పాల్గొన్నారు. పరస్పరం శమీ పత్రిని పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వారిద్దరూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శమీ పూజలో పార్టీలకతీతంగా పాల్గొనడంపై పట్టణవాసుల్లో ఆనందం వ్యక్తం చేశారు. పురపాలక సంఘం ముఖ్యాధికారి గంగాధర్, యువ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజా రామచంద్రనాయక్, పురపాలక సంఘం సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

సంచార పోలీసుల కోసం వినతి

రాయచూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో సంచార రద్దీ అధికంగా ఉండే పాఠశాలలు, కళాశాలల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో సంచార ఠాణా పోలీసులను విధుల్లో ఉంచడానికి చర్యలు తీసుకోవాలని 'భీమ్ ఆర్మీ' జిల్లా యంత్రాంగానికి విన్నవించింది. ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు దీపక్ బండారి, ప్రధాన కార్యదర్శి బాబా ఖాన్ జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతీ నిలయాల వద్దనున్న రహదారులపై వాహనచోదకులు రోడ్డు నిబంధనలు ఉల్లంఘించి వేగంగా వాహనాలు నడుపుతున్నారని వాపోయారు. విద్యాలయాలు మొదలయ్యే, పిల్లలను వదిలే సమయాల్లో సంచార పోలీసులుంటేనే ప్రమాదాలు జరగకుండా అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. స్టేషన్ రహదారిలోని ప్రభుత్వ పీయూసీ బాలికల కళాశాల, కాన్వెంట్ వద్ద ట్రాఫిక్ రద్దీపై దృష్టి పెట్టాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

రహదారులు రక్తసిక్తం

మూడు రోజుల్లో ఆరుగురి మృతి

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లా రహదారులు రక్తమోడుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వాహనంపై బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం దారుణం. ఈ ప్రమాదాలన్నీ రాయచూరు- హైదరాబాద్, రాయచూరు-మాన్వి రాష్ట్ర రహదారులపైనే చోటుచేసుకోవడం గమనార్హం. అతి వేగం, సంచార నిబంధనలు పాటించక పోవడం వల్లే ఘటనలు జరిగాయని పోలీసులు అంటున్నారు. మరోవైపు పట్టణ పరిధిలో వేగంగా వెళుతున్న కార్లను సంచార పోలీసులు నియంత్రించక పోవడమే ప్రమాదాలకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం రాయచూరు తాలూకా యరమారస్ థర్మల్ కేంద్రం(వైటీపీఎస్) సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో దానిపై ప్రయాణిస్తున్న జనార్దన్, చెన్నబసవ పాటిల్ అనే వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఇంటి పెద్దల మృతితో ఆ కుటుంబాలు వీధిన పడ్డాయి. దసరా రోజు సాక్షి అనే విద్యార్థిని లింగసూగూరు రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అసువులు బాసింది. తల్లిదండ్రులకు జీవితాంతం శోకం మిగిలింది. సిరివార తాలూకా కల్లూరు గ్రామం వద్ద సోమవారం కారు-లారీ ఢీకొన్న ఘటనలో మాన్వి పట్టణానికి చెందిన ముగ్గురు మృతి చెందడం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఇలాంటి భయానక ఘటనలు కళ్ల ముందే జరుగుతున్నా కొంత మంది చోదకుల్లో మార్పు రావడం లేదని పోలీసులు అంటున్నారు.



వైటీపీఎస్ వద్ద జరిగిన ప్రమాదం

కృష్ణా వంతెనపై భయభయంగా ప్రయాణం

రాయచూరు తాలూకా దేవసూగూరు సమీపంలోని కృష్ణా వంతెన రహదారిపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని చోదకులు, ప్రజలు వాపోతున్నారు. 75 ఏళ్ల క్రితం అప్పటి జనాభాను దృష్టిలో ఉంచుకుని ఈ వంతెన నిర్మించారు. నిత్యం వందలాది వాహనాలు సంచరిస్తున్నందున 24 గంటలు రద్దీగానే ఉంటుంది. ఏదైనా పెద్ద వాహనం వస్తే రెండు వైపులా సంచారం ఆగిపోతుంది. లారీ లేదా బస్సు పాడైనా, ప్రమాదం జరిగినా గంటల కొద్దీ ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతాయి. మేకలు, గొర్రెల మందలు అడ్డు వచ్చిన సమయంలోనూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వంతెన వద్ద ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల పోలీసులూ ఉండరు. వాహనాల సంచారాన్ని కట్టడి చేసేవారు లేక చోదకులు పడే కష్టాలు వర్ణనాతీతం. రాయచూరు లేదా మాగనూరు నుంచి పోలీసులు వచ్చేవరకు వాహనదారులు వేచి ఉండాల్సిందే. కొత్త వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు తమకు అవస్థలు తప్పవని వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణా వంతెనపై స్తంభించిన వాహనాల రాకపోకలు

జోషిపై సిద్ధు గరం

ధార్వాడ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ తీవ్రవాదులకు మద్దతు ఇస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఇతర భాజపా నాయకులు చేస్తున్న విమర్శలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. ధార్వాడలో ఆయన ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో భాజపా నాయకులు ఆరితేరారని విమర్శించారు. ప్రహ్లాద్ జోషి అందరికన్నా పెద్ద ఉగ్రవాది అని వ్యాఖ్యలు చేశారు.

● పాత హుబ్బళ్లి పోలీసు ఠాణాపై 2022లో దాడికి పాల్పడిన నిందితులపై కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకుంటున్నట్లు ఆరోపిస్తూ భాజపా నాయకులు ధర్నాకు దిగారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, భాజపా ఎమ్మెల్యే మహేశ్ టెంగినకాయి నేతృత్వంలో నిర్వహించిన ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. రాస్తారోకో చేసిన ఆందోళనకారులను వెనక్కు వెళ్లాలని నగర పోలీసు కమిషనర్ శశికుమార్ చేసిన హెచ్చరికలను ఆందోళనకారులు పట్టించుకోలేదు. వారిని అరెస్టు చేసి, స్థానిక ఠాణాకు తీసుకువెళ్లి, అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఉత్సాహంగా ఆర్ఎస్ఎస్ కవాతు

రాయచూరు, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పట్టణంలో సోమవారం నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. సాయంత్రం 4.15 గంటలకు వీరాంజనేయ మున్నూరు కాపు కల్యాణ మంటపం వద్ద మొదలైన కవాతు బసవన బావి కూడలి, మాతా లక్ష్మమ్మ దేవస్థానం రహదారి, పటేల్ కూడలి, శెట్టి బావి చౌక్, బంగారు బజారు, తీనకందిల్, బట్టె బజార్, మహావీర కూడలి, హరిహర రస్తా, చంద్రమౌళీశ్వర కూడలి మీదుగా గంజ్ రహదారి వరకు సాగింది. తిరిగి బసనబావి కూడలి మీదుగా వీరాంజనేయ కల్యాణ మంటపం చేరుకుంది. జిల్లా సంఘ్ సంచాలకుడు సదానంద ప్రభు, కర్ణాటక ఉత్తర, దక్షిణ ప్రాంతాల ప్రచార విభాగం(హుబ్బళ్లి) సంఘ్ ప్రముఖుడు అరుణకుమార్ కవాతుకు నేతృత్వం వహించారు. కూడళ్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కవాతులో స్వయంసేవకులు

వరి పైరు..సాగు జోరు

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా అంతటా వరిపైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. అన్నదాతలు సైతం ప్రశాంతచిత్తంతో ఉన్నారు. కాలువల్లో నీటి సమస్య పెద్దగా లేదు. వరి పైరుకు చీడపీడలు, రోగాల బాధలు అంతగా లేవు. గతంలో మాదిరి కాకుండా ధర ఎక్కువగా ఉన్నా..ఎక్కువ రోజులు నియంత్రణ సామర్థ్యం గల కీటనాశకాలు అందుబాటులో ఉన్నందున రైతులు ధైర్యంగానే ఉన్నారు. సింధనూరు తాలూకాలో అక్కడక్కడ ఆర్ఎన్ఆర్ రకం సాగు ఉన్నా..అగ్రభాగం మాత్రం బంగారంతో సమానంగా భావించే సోనా మసూరిదే. ప్రస్తుతం పైర్లకు ఈనెలు కనిపిస్తున్నాయి. ఇంకో నెల రోజులకు ఇవి పాలు పోసుకుని గింజలు కడతాయి. అడపాదడపా వానలు కురవడం..జలాశయానికి అక్టోబరులో కూడా ఇన్‌ఫ్లో కొనసాగడంతో కాలువల్లో నీరు సమృద్ధిగానే పారుతుండటంతో పైర్లు కళకళలాడుతున్నాయి. వచ్చే నెల చివరి వారానికి లేదా డిసెంబరు మొదటి వారానికి పంట చేతికి అందుకుంటామని రైతులు చెబుతున్నారు. రెండో పంటకు సైతం డోకా లేదని కనపడుతున్నందున నారు పోసుకోడానికి కొంతమేర పొలాన్ని ఇప్పటికే సిద్ధంగా ఉంచుకున్నామని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



సింధనూరు అంతటా పచ్చదనంతో కళకళలాడుతున్న వరి పైరు

26 నుంచి రాష్ట్ర కార్మిక సమ్మేళనం

రాయచూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి నాలుగో కార్మిక సమ్మేళనం 26, 27వ తేదీల్లో మైసూరులో జరుగుతుందని ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ యాదగిరి వెల్లడించారు. ఆయన సోమవారం పత్రికా భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, పెట్టుబడిదారుల వేధింపులపై పోరాటం చేసేందుకు విధి విధానాలు ఖరారు చేస్తామన్నారు. దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్, పదేళ్లుగా అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం పారిశ్రామికవేత్తల ప్రయోజనాలను కాపాడేందుకే పెద్ద పీట వేశాయని ఆరోపించారు. కార్మికులకు నష్టం కలిగించే ఆర్థిక, సరళీకృత విధానాలను వేగంగా అమలు చేయడానికి ప్రాధాన్యత ఇచ్చాయని ధ్వజమెత్తారు. ప్రకృతి సంపదను దోచిపెట్టేందుకు పోటీపడ్డాయని ఆరోపించారు. శ్రమజీవుల కాయాకష్టంతోనే శ్రీమంతుల చేతిలో 60 శాతంపైగా దేశ సంపద ఉందని, అయినా యజమానులు కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచడం లేదని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించనందున అభద్రత మధ్య సేవలందిస్తున్నారని వాపోయారు. కర్ణాటకలో గత భాజపా సర్కారు 8 గంటల పనివేళలను 12 గంటలకు పెంచిందని, సిద్ధరామయ్య ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తోందని మండిపడ్డారు. కార్మికుల కనీస వేతనాన్ని రూ.35 వేలుగా నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని వర్తింపచేయాలని, పాత పింఛన్ పద్ధతి ప్రవేశపెట్టాలని డిమాండు చేశారు. సమ్మేళనంలో వీటన్నింటిపై సుదర్ఘీంగా చర్చిస్తామని చెప్పారు. ఆయన వెంట ప్రతినిధులు మహేశ్ చీకలపర్వి, అణ్ణప్ప తదితరులున్నారు.



పాత్రికేయులకు వివరిస్తున్న సోమశేఖర్

16న లింగసూగూరులోకి రథ జ్యోతియాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే: అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని పురస్కరించుకుని 16న జిల్లాలోని లింగసూగూరులోకి ప్రవేశిస్తున్న రథ జ్యోతి యాత్రకు ఘన స్వాగతం పలకాలని కసాప జిల్లా అధ్యక్షుడు రంగణ్ణ పాటిల్ పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు ప్రజలు సరిహద్దుకు చేరుకోవాలని కోరారు. శాసనసభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, విద్యా సంస్థలు, ఎన్‌సీసీ, స్కౌట్, గైడ్స్ విద్యార్థులు, సంఘ సంస్థల ముఖ్యులు జ్యోతి యాత్రను సాదరంగా ఆహ్వానించాలని విన్నవించారు. అనంతరం యాత్ర దేవదుర్గ మార్గం మీదుగా అదేరోజు రాత్రి 9 గంటలకు రాయచూరు చేరుతుందని చెప్పారు. 17న ఉదయం రాయచూరు, మాన్వి, సిరివార, మస్కి, సింధనూరు మీదుగా కొప్పళ్ జిల్లాలోకి వెళుతుందనివివరించారు. ఆయా తాలూకాల ప్రజలు యాత్రకు బ్రహ్మరథం పట్టాలన్నారు. డిసెంబరు 20 నుంచి 22 వరకు మండ్య జిల్లాలో సమ్మేళనం జరుగుతున్న విషయం తెలిసిందే.

సేవలందించాం.. ఇక సెలవ్!

మైసూరు, న్యూస్‌టుడే : విశ్వ విఖ్యాత దసరా ఉత్సవాలకు తెరపడడంతో వివిధ అటవీ శిబిరాల నుంచి వచ్చి.. వేడుకల్లో సేవలందించిన ఏనుగులు తిరిగి తమ శిబిరాలకు సోమవారం బయలుదేరాయి. ప్యాలెస్ ఆవరణలో ఒకటిన్నర నెలల పాటు అభ్యాసంలో పాల్గొని, శనివారం జంబూ సవారీలో పాల్గొన్న ఏనుగులకు అటవీశాఖ అధికారులు, మావటీలు, మైసూరు దసరా ఉత్సవ సమితి ప్రతినిధులు పూజలు చేశారు. లారీలను ఎక్కించి, వాటిని ఆయా శిబిరాలకు తరలించారు. కాగా, రాత్రుళ్లు విద్యుత్తు దీపాలంకరణను ఈ నెల 22 వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. సోమవారం కూడా మైసూరులో పర్యాటకుల సంఖ్య, రద్దీ ఎక్కువగానే కనిపించింది.



అటవీ శిబిరానికి వెళ్లేందుకు లారీలు ఎక్కిన ఏనుగులు



విద్యుత్తు దీపాలతో మెరిసిపోతున్న రాచనగరి

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న కారు

● కలబురగి వాసులకు తీవ్ర గాయాలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న సరకు రవాణా వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ చెన్నేకొత్తపల్లి మండలం దామాజిపల్లి 44వ జాతీయ రహదారి కూడలి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలబురగి(గుల్బర్గా)కి చెందిన నలుగురు మిత్రులు వీరేశ, సంగనాథ్, సిద్ధలింగ, హరీశ్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. దసరా పండగకు స్వగ్రామాలకు వెళ్లి తిరిగి బెంగళూరు వెళుతుండగా, వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి సరకు రవాణా వాహనాన్ని ఢీకొంది. వీరేశ, సంగనాథ్, సిద్ధలింగ తీవ్రంగా గాయపడగా, కారు నడుపుతున్న హరీశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో సీకేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పంపారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఘోర ప్రమాదం: ముగ్గురి దుర్మరణం


మాన్వి, న్యూస్‌టుడే: సిరివార తాలూకా పరిధి కల్లూరు సమీపంలో కారు, లారీ ఢీకొనడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్వి పట్టణానికి చెందిన మెకానిక్‌లు యాసిన్ (21), మక్బల్ (24), చోదకుడు హర్షద్ (23) సోమవారం సాయంత్రం కారులో రాయచూరు బయలుదేరారు. కల్లూరు సమీపంలో రాయచూరు- సింధనూరు ముఖ్య రహదారి 23పై వేగంగా వచ్చిన లారీ యువకులు ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొంది. ఆ ధాటికి కారు ముందు వైపు సగ భాగం లారీ లోపలికి దూసుకుపోయింది. కారు ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని అతికష్టంపైన జేసీబీ సాయంతో కారును అందులో ఇరుక్కున్న మూడు మృతదేహాలను బయటికి తీశారు. సిరివార పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

రంగశంకరలో కళాతరంగాలు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని 'రంగశంకర' నాటకశాలలో గురువారం ప్రారంభమైన నాటకోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. హొన్ను మణ్ణిన ఆట, దస్తానే అశోక్ ఓ అక్బర్ హిందూస్తానీ, ది ఫార్ పోస్ట్, మెహఫిల్ తదితర నాటకాలు, కార్యక్రమాలకు ప్రేక్షకుల నుంచి చక్కని స్పందన లభించింది. అరగంట నుంచి రెండు గంటల నిడివి ఉన్న కార్యక్రమాలలో దేశంలోని ప్రముఖ కళాకారులు పాల్గొనగా, ప్రముఖ దర్శకులు ఆయా నాటకాలకు దర్శకత్వం వహించారు.



'హొన్ను మణ్ణిన ఆట' ప్రదర్శనలో సన్నివేశం



ప్రదర్శనలో రత్నా పాఠక్ షా



ప్రదర్శనలో కొమ్ముల మనిషి

సతీశ్ అభిమానుల జోరు

బెళగావి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బెళగావి పర్యటన సందర్భంలోనే 'కాబోయే ముఖ్యమంత్రి సతీశ్ జార్ఖిహొళికి అభినందనలు' అంటూ పోస్టర్లు వెలిశాయి. సతీశ్ అభిమానులు, కర్ణాటక రక్షణ వేదికె నారాయణగౌడ వర్గానికి చెందిన నాయకులు నగర వీధుల్లో ఈ పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. స్థానిక నేతలు తనపై అభిమానంతో ఆ పోస్టర్లు ఏర్పాటు చేశారని సతీశ్ పేర్కొన్నారు.

పాత కక్షలతో యువకుడి హత్య

రాయచూరు, న్యూస్‌టుడే: పాత కక్షలు పాతికేళ్ల యువకుడి హత్యకు దారి తీశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణ నివాసులైన ఆటో డ్రైవర్ సమీర్ (25), పండ్ల వ్యాపారి అమాన్ మధ్య గతంలో గొడవలు ఉండేవి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తీనకందిల్ వద్ద ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విచక్షణ కోల్పోయిన అమాన్ జేబులోని చాకు తీసి సమీర్‌ను పొడవడంతో తీవ్ర రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న సదరబజార్ ఠాణా పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు నిందితుడు అమాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



సమీర్

టిప్పర్-బైక్ ఢీకొని ఒకరి మృతి

మాన్వి, న్యూస్‌టుడే: తాలూకాలోని అరకెరా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అరకెరాలోని సిరివార్ రోడ్డులో ఎడ్యుకేషన్ లేఅవుట్ వద్ద సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దేవదుర్గ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరిమరిడి తండాకు చెందిన హొన్నప్ప (48) తన భార్య ఉమవ్వతో కలిసి మరిడి మారెమ్మ ఆలయానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వేగంగా వచ్చిన టిప్పర్ వారిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన హొన్నప్ప అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న ఉమవ్వకు పెద్ద దెబ్బలు తగిలాయి. ఆమెను పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దేవదుర్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హొన్నప్ప

ఎన్నికల కోసమే నగదు మళ్లింపు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన నగదును దారి మళ్లించి అందులో కొంత మొత్తాన్ని బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చు చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ అభియోగపత్రంలో పేర్కొన్నారు. రూ.187 కోట్ల నిధుల నుంచి రూ.89.62 కోట్లను ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఖాతాలకు అక్రమ మార్గంలో తరలించారని ఈడీ అధికారులు ఆరోపించారు. అక్రమాల్లో మాజీ మంత్రి బి.నాగేంద్రను ప్రధాన నిందితుడని అందులో నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఫస్ట్ క్రెడిట్ కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, బ్యాంకు అధ్యక్షుడు ఇటకారి సత్యనారాయణ, కార్పొరేషన్ ఎండీ జేజీ పద్మనాభ, వారి అనుచరులు నాగేశ్వరరావు, నెక్కంటి నాగరాజ్, విజయకుమార్ గౌడ తదితరులను నిందితులుగా చేర్చారు. గంగా కల్యాణ పథకానికి కేటాయించిన రూ.43.33 కోట్లను అక్రమ ఖాతాలకు మళ్లించగా, అందులో బళ్లారి ఎన్నికల కోసం రూ.20.19 కోట్లు దారి మళ్లించి ఖర్చు చేశారని దర్యాప్తులో గుర్తించారు.

శాంభవి మాతకు విశేష పూజలు

సిరివార (మాన్వి), న్యూస్‌టుడే: సిరివార తాలూకా నవలకల్ బృహన్మఠాన్ని సోమవారం సాయంత్రం రాష్ట్ర చిన్ననీటి, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి బోసురాజు మాట్లాడుతూ పండగలు, విశేష సందర్భాల్లో తాము తప్పకుండా నియోజకవర్గంలోని అన్ని మఠాలను సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారికి పూజలు చేస్తే ఉత్తేజం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ క్షేత్రంలోని మఠాలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నాయని గుర్తుచేశారు. అనంతరం మఠంలో మంత్రి, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. మఠాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మఠానికి వచ్చిన నాయకులను అభినవ సోమనాథ్ శివాచార్య స్వామి ఘనంగా సత్కరించారు.

సిద్ధరామేశ్వర మఠంలో మహోత్సవం: తాలూకాలోని హీరా గ్రామంలో ప్రసిద్ధి చెందిన సిద్ధరామేశ్వర మఠం ఆధ్వర్యంలో సోమవారం మంత్రి బోసురాజు దసరా ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జంబూ సవారీ నిర్వహించారు. వివిధ కళాకారుల బృందాల ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, సిరివార పట్టణ పంచాయతీ అధ్యక్షుడు భూపనగౌడ, కాంగ్రెస్ నాయకులు చుక్కిసూగప్ప సాహుకార్, శాంతప్ప, శరణయ్య నాయక్ గుడదిన్ని, రమేష్ దర్శన్‌కర్, గంగాధర్‌స్వామి, రుద్రప్ప, శివమూర్తి, అమరేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి బోసురాజును సన్మానిస్తున్న స్వామి

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

14-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.97	1614.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	82,504	714
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	82,324	9258
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.656	47.059

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

వృద్ధాశ్రమల స్థాపనకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లాలో వృద్ధాశ్రమాలు తెరిచేందుకు అర్హత కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భర్తీ చేసిన దరఖాస్తును ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాతి దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. అదనపు వివరాలకు రాయచూరులోని కార్యాలయాన్ని సంప్రదించాలని అందులో కోరారు.

'ఉపాధ్యాయ ఎన్నికల్లో అక్రమాలు'

సింధనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి జరుగుతున్న ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి..తక్షణం జిల్లాధికారి జోక్యం చేసుకుని సరిచేయాలని ప్రభుత్వ ప్రాథమిక, ప్రౌఢశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాధికారి, ఏసీ, తహసీల్దారుకు సిట్టింగ్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్ హిరేమఠ్ చేస్తున్నది దురహంకార ధోరణి అని సోమవారం ఫిర్యాదు చేశారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగుల్లో అత్యధిక ఓట్లు ఉన్నది విద్యాశాఖ. ప్రతిసారి ఈ శాఖకు నాలుగు స్థానాలు కేటాయించే వారు. ఈసారి రెండే స్థానాలకు కుదించారని సిట్టింగ్ అధ్యక్షుడిపై ఆరోపణలు గుప్పించారు. ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నాయి. 18 నామపత్రాలు సమర్పించడానికి ఆఖరుతేదీ. మాకు నాలుగు రోజుల వ్యవధిలో తమ విద్యా శాఖ ఓటర్ల జాబితాను ఇచ్చారని తెలిపారు. తాలూకాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో మొత్తం నాలుగు వేల వరకూ ఓటర్లు (ప్రభుత్వ ఉద్యోగులు) ఉన్నారు. మొత్తం జాబితాను కోరితే ఇవ్వట్లేదని దుయ్యబట్టారు. ఇప్పటికే రెండుసార్లు అధ్యక్షుడిగా ఏలుబడి సాగించి..మూడోసారి కూడా కన్నేసిన చంద్రశేఖర్ దురహంకారంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులను తన



తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు